
రసాయనాలతో పండ్లు మాగబెడితే.. సీరియస్ యాక్షన్ 2



ఆయనొక్కడి కోసమే పోలింగ్ బూత్ 2




# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 18 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 102 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




## 30 లక్షల టన్నుల

# బాయిల్డ్ రైస్‌ను కొనుగోలు చేయండి

**వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో రాష్ట్రం అగ్రగామిగా ఉంది**

పోషకాహార బియ్యం పంపిణీని పునరుద్ధరించండి

కేంద్ర మంత్రి జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుండి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమనీ, గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా

...మిగతా 2లో

## మహిళా రిజర్వేషన్లు మరోసారీ వాయిదా!!


# వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు

## లోక్ సభలో మెజారిటీ సాధించలేకపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోయింది.

దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు.

చట్ట సవరణకు అవసరమైన 'టూ థర్డ్స్(326 ఓట్లు)' మెజారిటీ సాధించలేకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా బిల్లు వీగిపోయినట్లు ప్రకటించారు.




మహిళా రిజర్వేషన్ బిల్లులో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది.

ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్లో బిల్లు వీగిపోయింది. ఇది వీగిపోవడంతో మిగిలిన రెండు బిల్లులైన.. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026లను ఎన్డీయే సర్కారు వెనక్కి తీసుకుంది.

**సభ వాయిదా..**

మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో సభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో స్పీకర్ సభను రేపటికి వాయిదా వేశారు. మహిళా సాధికారతకు విపక్షాలు అడ్డుపడ్డాయని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయమని, దక్షిణాది రాష్ట్రాల గళాన్ని వినిపించడంలో తాము సఫలమయ్యామని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇతర నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. గత కొన్నేళ్లలో కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్లో ఎదురైన అతిపెద్ద ఎదురుదెబ్బగా దీన్ని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

దేశవ్యాప్త ఆందోళనలకు ఎన్డీయే పిలుపు 2

ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి. మేం దాన్ని ఓడించాం. ఇది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదని ముందే చెప్పాం

-రాహుల్ గాంధీ



ఈ పద్ధతిలో మహిళా బిల్లును పెట్టడాన్ని వ్యతిరేకించాం

-ప్రియాంకా గాంధీ





ఢిల్లీని ఓడించాం

-తమిళనాడు సీఎం స్టాలిన్

## బీజేపీ ఎంపీ తేజస్వి క్షమాపణ చెప్పాలె

పార్లమెంట్ ఆవరణలో రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీల ఆందోళన

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** పార్లమెంట్ ఆవరణలో రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తేజస్వి సూర్యకు వ్యతిరేకంగా రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి,

...మిగతా 2లో




## దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే

# కుట్రను అడ్డుకున్నం

ఇది సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయం

జాతీయ విపత్తును నివారించిన రోజు

రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం

...మిగతా 2లో



## న్యాయ సలహా తీసుకుంటం

మంత్రి పొన్నం లేఖపై డీజీపీ

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం, ప్రత్యేక ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల విభజనను ఇండియా-పాకిస్థాన్‌తో పోల్చిన ఎంపీ తేజస్వీ సూర్య పై చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీకి లేఖ రాసి విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ లేఖపై డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. తేజస్వీ సూర్యపై ప్రస్తుతానికి కేసు పెట్టే అవకాశం లేదని, ఈ విషయంలో న్యాయపరమైన సలహా తీసుకుంటామని డీజీపీ స్పష్టం చేశారు.

## మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ

# కల్నల్ పరిచిత్ మెహ్రా కమిటీ

**మరమ్మత్తు పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17(మనం బ్యూరో):** కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు కల్నల్ పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల

...మిగతా 2లో



## విద్యుత్ శాఖ ఆర్టిజన్ల సమ్మె విరమణ

డిప్యూటీ సీఎం భట్టితో జేఏసీ నేతల చర్చలు సఫలం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, (మనం బ్యూరో):** గత కొద్ది రోజులుగా సమ్మె బాట పట్టిన విద్యుత్ శాఖ ఆర్టిజన్లు సమ్మె విరమించారు. ట్రాన్స్‌కో సీఎండీతో ఆర్టిజన్ల సమస్యలు చర్చించి పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించిన క్రమంలో సమ్మె యోచనను విరమించుకుంటున్నట్లు విద్యుత్ ఉద్యోగులు వెల్లడించారు. శుక్రవారం విద్యుత్ ఉద్యోగులతో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారనీ, ఉన్నతాధికారులతో చర్చలకు

...మిగతా 2లో

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్సీ హామీని వెంటనే అమలు చేయాలి

ఉద్యోగ సంఘాల జేఏసీ నేత దేవీప్రసాద్

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నేత దేవీప్రసాద్

...మిగతా 2లో

## మహిళలను మళ్లీ వంచించారు



### బీజేపీపై కవిత ఫైర్

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం, ప్రత్యేక ప్రతినిధి):** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. 'డీలిమిటేషన్ బిల్లుతో మహిళా బిల్లును కలపడంతోనే

...మిగతా 2లో

## మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

- పాక్‌కు భారత్ హెచ్చరిక
- డీలిమిటేషన్ బిల్లుపై ఆ దేశ వ్యాఖ్యల తిరస్కరణ

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** మా దేశ అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్ ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్

...మిగతా 2లో

## ఫస్ట్ టార్గెట్.. బీఆర్ఎస్

పదేళ్లు...ఎవరి పళ్లు తోమారు

కేటీఆర్ పాదయాత్రను ఎవరూ నమ్మరు

గులాబీ దళంలో హరీశ్ రావు గ్రూపులు కట్టారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నరు

త్వరలోనే వారి పేరు ప్రకటిస్తా

అందరికీ అధికారం కావాలని కొట్లాడిన

కొత్త పార్టీలో మహిళలకు, బీసీలకు పెద్దపీట

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

2








# హర్మూజ్‌ను పూర్తిగా తెరిచినం

## ఎవరి నౌకలైనా రావచ్చు..పోవచ్చు..

### ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడి

**టెహ్రాన్, ఏప్రిల్ 17:** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు

...మిగతా 2లో

# బాయిల్డ్ రైస్‌ను కొనుగోలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పెంచాలని రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటి ధాన్యం ఉత్పత్తి అవుతుందని వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందనీ, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటి బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటి రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి వివరించారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి సీఎం రేవంత్ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే, 2014-15 వర్షాకాలం పంట అదనపు లేవీ సేకరణకు సంబంధించిన రూ.1, 468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందనీ, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందనీ, దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని తగ్గించేందుకు వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు.

పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసే వారనీ, ఇటీవల దానిని నిలిపి వేశారని పేర్కొంటూ వాటి పంపిణీని వెంటనే పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఇచ్చిన హామీ అమలుపై గత రెండేళ్లుగా ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేదన్న ఆవేదనతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారన్నారు. గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు ఉద్యోగులు ఆందోళనకు దిగారనీ, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేశంలోనే 5 డీఏలు బకాయి పడ్డ ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల 86 మంది చనిపోయారనీ, వేలాది మంది నిత్యం కోర్టులు, సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. అయినా, అధికారులు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పీఆర్సీ ప్రకటించాలనీ, డీఏలు విడుదల చేయాలనీ, పెన్షనర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యుత్ శాఖ ఆర్టిజన్ల సమ్మె విరమణ

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించారని తెలిపారు. కాగా, విద్యుత్ ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలనీ, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసీ వేసవిలో విద్యుత్ డిమాండ్ పీక్ స్టేజిలో ఉన్న సమయంలో ఉద్యోగులు అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైంది కాదని భట్టి పేర్కొన్నారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందనీ, విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు జరుపుతుందనీ, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండి చర్చలు జరుపుతారనీ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని భట్టి హామీ ఇచ్చారు.

## కల్నల్ పరిచిత్ మెహ్రా కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మత్తులకు సమన్వయ కమిటీని నియమించిన ప్రభుత్వం ప్రాజెక్టు రిపేర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

వర్షాకాలం ప్రారంభానికి ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలనీ, ఇందులో భాగంగా మే 30లోగా పరిశీలనలు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించింది.

రోజువారీగా పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రతీ రోజూ సాయంత్రం 5 గంటలకు నివేదిక ఇవ్వాలనీ, సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## బీజేపీ ఎంపీ తేజస్వి క్షమాపణ చెప్పాలె

(మొదటి పేజీ తరువాయి)

మల్లు రవి, కడియం కావ్య, రఘురాం రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్, వంశీకృష్ణ నినాదాలు చేశారు. ఆయన తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దనీ, వందలాది మంది అమరుల త్యాగం, కోట్లాది మంది ఒక్కటై కొట్లాడిన ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాధన అని పేర్కొన్నారు. తేజస్వి తెలంగాణపై చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తేజస్వి వ్యాఖ్యలు తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన త్యాగాలు, ప్రజాస్వామ్య పోరాటం చేసిన ప్రజల మనోభావాలు తీవ్రంగా గాయపరిచాయని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు పార్లమెంట్ గౌరవ మర్యాదలకు విరుద్ధమనీ, రూల్ 380 ప్రకారం స్పీకర్‌కు ఉన్న అధికారాలను ఉపయోగించి సభ అధికారిక రికార్డుల నుంచి తేజస్వి వ్యాఖ్యలను తొలగించాలన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వ్యతిరేకంగా కూడా రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు.

## దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే కుట్రను అడ్డుకున్నం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోషల్ మీడియా మాధ్యమం అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడంలో ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేందుకు కేంద్రం పన్నిన డీలిమిటేషన్ కుట్రను ప్రజాస్వామ్య శక్తులు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. ఇది కేవలం బిల్లు వీగిపోవడం కాదు, సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సవరణల పేరుతో దేశ రాజకీయ సమతుల్యతను దెబ్బతీసేందుకు ఏ శక్తులు ప్రయత్నించినా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వాటిని తిప్పికొడుతుందని ఈ ఓటింగ్ నిరూపించిందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదనీ, అయితే వాటిని డీలిమిటేషన్, కులగణనతో ముడిపెట్టి కాలయాపన చేయడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఐక్యంగా నిలబడి తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడారని కొనియాడారు. ఇది జాతీయ విపత్తును నివారించిన రోజు అనీ, ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆలోచించి నిర్ణయం తీసుకోండి

### ఎక్స్ వేదికగా రాజకీయ పక్షాలకు మోడీ విన్నపం

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై శుక్రవారం ఓటింగ్ కన్నా ముంప్రధాని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. కాసేపట్లో లోక్ సభలో ఓటింగ్ జరగనుందని, అన్ని రాజకీయ పక్షాలూ తగిన పరిశీలన అనంతరం మహిళా రిజర్వేషన్ కు అనుకూలంగా ఓటు వేయాలని కోరారు.

'నారీ శక్తి వందన్ అధినియమ్ కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది.

## రసాయనాలతో పండ్లు మాగబెడితే.. సీరియస్ యాక్షన్

**ఢిల్లీ , ఏప్రిల్ 17:** అసలే వేసవికాలం.. రోజులో ఒక పండు అయినా తినాల్సిందే. ఇక, మామిడి పండ్ల సీజన్ కావడంతో పండ్ల మార్కెట్లలో వాటి సందడే వేరేలా ఉంటుంది. ఈక్రమంలో ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పండ్లను కృత్రిమంగా మాగబెట్టేందుకు హానికర రసాయనాలు వాడటంపై కన్నెర్ర జేసింది. అక్రమదారుల్లో పండ్లను మాగబెట్టేవారిని గుర్తించేందుకు ముమ్మర తనిఖీలు చేపట్టాలని అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. మామిడి, బొప్పాయి వంటి పండ్లను కృత్రిమంగా మాగబెట్టేందుకు వినియోగించే కాల్షియం క్యాడ్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం ఉంది. ఈ విషయాన్ని తాజాగా మరోసారి గుర్తు చేసింది. ఈ కాల్షియం క్యాడ్ ఉపయోగించిన పండ్లను తీసుకుంటే.. వాంతులు, చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అరటి, ఇతర పండ్లను కృత్రిమంగా మాగబెట్టేందుకు ఎథోఫాన్ పొడిని వినియోగిస్తున్నారని తెలిపింది. ఈ క్రమంలో పండ్ల మార్కెట్లతో పాటు నిల్వ కేంద్రాలు, టోకు వ్యాపారులు, పంపిణీదారుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రతా కమిషనర్లు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రాంతీయ డైరెక్టర్లను ఆదేశించింది. ఎవరైనా కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలు వినియోగిస్తున్నట్లు తేలితే.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

## 131వ సవరణ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్సభలో చుక్కెదురైంది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రతిష్టాత్మక బిల్లు, కావాల్సిన మెజార్టీ సాధించలేక వీగిపోయింది. శుక్రవారం రాత్రి జరిగిన ఓటింగ్లో ప్రభుత్వం నిర్దేశించుకున్న 'మ్యాజిక్ ఫిగర్'ను అందుకోవడంలో విఫలమైంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో హాజరైన సభ్యులలో మూడింట రెండొంతుల (2/3) మెజార్టీ తప్పనిసరి.

**ఫలితాలు :**

ఓటింగ్లో పాల్గొన్న సభ్యులు: 528

బిల్లుకు మద్దతుగా: 298 ఓట్లు.

బిల్లుకు వ్యతిరేకంగా: 230 ఓట్లు

బిల్లు ఆమోదానికి కావాల్సిన ఓట్లు: 352

బిల్లుకు అనుకూలంగా ఎక్కువ ఓట్లు వచ్చినప్పటికీ, రాజ్యాంగ నిబంధనల ప్రకారం కావాల్సిన మూడింట రెండొంతుల బలం లేకపోవడంతో స్పీకర్ ఈ బిల్లు వీగిపోయినట్లు ప్రకటించారు. మొదటి నుంచి డీలిమిటేషన్ అంశాన్ని వ్యతిరేకిస్తున్న 'ఇండియా' కూటమి పార్టీలు అనుకున్నట్లుగానే ఓటింగ్లో ఐక్యంగా నిలిచాయి. మహిళా రిజర్వేషన్ సాకుతో దక్షిణాది రాష్ట్రాల సీట్లను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, జనాభా లెక్కలు, డీలిమిటేషన్తో ముడిపెట్టడం సరికాదని విపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు నేతలు వాదించారు. అధికార ఎన్డీయే కూటమి చిన్న పార్టీలను, మరియు తటస్థ ఎంపీలను ఆకర్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, మేజిక్ ఫిగర్కు కావాల్సిన మరో 60-70 ఓట్లను కూడగట్టలేక

**ముగిసిన ఉత్కంఠ..**

బిల్లు వీగిపోవడంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ఈ పరిణామం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 'మహిళల పట్ల విపక్షాలకు గౌరవం లేదని ఈ ఓటింగ్ నిరూపించింది' అని బీజేపీ మండిపడుతుండగా, 'ఇది ప్రజాస్వామ్య విజయం, సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకున్నాం' అని విపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి.

## అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

జయస్వాల్ ప్రకటించారు.దేశంలోని పరిపాలనా, శాసనపరమైన ప్రక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమని హెచ్చరించారు. పాకిస్థాన్ ఆక్యుపైడ్ కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ చెప్పారు.

## హర్మూజ్‌ను పూర్తిగా తెరిచినం

(మొదటి పేజీ తరువాయి)

హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు.

**పడిపోయిన ముడిచమురు ధరలు**

ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది.

# మహిళా సాధికారత కోసమే

- **ఒక ఎంపీ లక్షల మంది సమస్యలను ఎట్ల వినగలరు?**
- **ప్రజా ప్రతినిధులందరికీ సమాన హక్కులే ఉంటాయి**
- **లోక్‌సభలో బిల్లులపై చర్చకు సమాధానమిచ్చిన అమిత్ షా**



**ఢిల్లీ, ఏప్రిల్ 17:** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై కొనసాగిన సుదీర్ఘ చర్చ ముగిసింది. వీటిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు.

మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్ సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరు? నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించాం'' అని అమిత్ షా పే

**మల్కాజ్ గిరిలో దాదాపు 30లక్షల ఓటర్లు..**

''మల్కాజ్గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. ఢిల్లీ, బెంగళూరు, గాజియాబాద్లో 20 లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే'' అని కాంగ్రెస్ పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు.

**ఉతరాది.. దక్షిణాది కాదు..**

''ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుంది'' అని అమిత్ షా పేర్కొన్నారు.

**అలా చేస్తే మద్దతిస్తారా..?**

మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50 శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు.

## దేశవ్యాప్త ఆందోళనలకు ఎన్డీయే పిలుపు

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును విపక్షాలు అడ్డుకోవడంపై అధికార ఎన్డీయే కూటమి తీవ్రంగా స్పందించింది. శుక్రవారం బిల్లు వీగిపోయిన వెంటనే ప్రధాని మోడీ అధ్యక్షతన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విపక్షాల తీరును నిరసిస్తూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని కూటమి ఏకగ్రీవంగా నిర్ణయించింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రక అవకాశాన్ని విపక్షాలు కాలరాశాయని ఎన్డీయే నేతలు మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. మహిళా సాధికారతకు విపక్షాలు మొదటి నుంచీ అడ్డుపడుతున్నాయి. నేడు వారి మహిళా వ్యతిరేక మైండ్సెట్ దేశం ముందు బట్టబయలైంది అని ప్రధాని మోడీ ఈ సమావేశంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. మహిళా బిల్లుకు తాము అనుకూలమని చెబుతూనే, డీలిమిటేషన్ సాకుతో ఓటింగ్లో వ్యతిరేకించిన 'ఇండియా' కూటమి ద్వంద్వ నీతిని ఎండగట్టాలని ఎన్డీయే తీర్మానించింది.

## పొలిటికల్ డిమానిటైజేషన్‌గా డీలిమిటేషన్

- **రిజర్వేషన్ల అమలుకు నిర్ణయించిన శాసనపరమైన ప్రక్రియను తప్పు పట్టిన శశి థరూర్**

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** నియోజకవర్గాల పునర్విభజన అంటే ఒకరకంగా రాజకీయ విలువను తగ్గించడమే అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ విమర్శించారు. మహిళా రిజర్వేషన్లను పార్లమెంట్ స్థానాల విస్తరణతో ముడిపెట్టడం భావ్యం కాదన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అనుబంధ సవరణలు, డీలిమిటేషన్ బిల్లులపై చర్చ సందర్భంగా థరూర్ శుక్రవారం లోక్‌సభలో మాట్లాడారు.

'ఈ రోజు మనం మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా ఏకగ్రీవ నిర్ణయం తీసుకునే కీలక దశకు చేరుకున్నాం. సామూహిక భాగస్వామ్యంతో మన దేశం ప్రగతి దిశగా పయనించాలని ప్రతి పార్టీ గ్రహించింది.

కానీ, ఈ రిజర్వేషన్ల అమలుకు నిర్ణయించిన శాసనపరమైన ప్రక్రియ నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. ఈ బిల్లులతో నారీ శక్తికి న్యాయాన్ని కానుకగా ఇస్తున్నామని ప్రధాని పేర్కొన్నారు. కానీ, దాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి ఆ కానుకకు ప్రధాని ముళ్లకంచె వేశారు. ఇది మహిళల ఆకాంక్షలను బందీ చేయడమే'' అని శశిథరూర్ అన్నారు.

## మహిళలను మళ్లీ వంచించారు

(మొదటి పేజీ తరువాయి)

లోక్ సభలో వీగిపోయిందని, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని మరోసారి నిరూపితం అయ్యిందన్నారు. ప్రతిపక్షాలు అడ్డుకుంటాయనే స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ బీజేపీ కుట్ర పూరితంగా రెండు బిల్లులను కలిపి పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చిందని, మహిళా కోటా బిల్లుతో డెలిమిటేషన్ బిల్లును ముడి పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి లోక్ సభలో బిల్లు వీగిపోయేలా చేశాయని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఈ ప్రయత్నం చేసిందని, కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం అప్పుడే మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టి పాస్ చేసి దానిని సెన్సెస్‌కు లింక్ చేశారన్నారు. ఇప్పుడు 2011 సెన్సెస్ అధారంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెడుతున్నట్టు చెప్పి మరోసారి వంచించిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆడబిడ్డలు బీజేపీ మోసాన్ని గుర్తించాలని, పశ్చిమ బెంగాల్‌లో ఒక మహిళ నాయకత్వం వహిస్తోందని గుర్తు చేశారు. ఈక్రమంలో బెంగాల్ ఎన్నికలలో బీజేపీని ఓడించి ఆ మహిళను గెలిపించాలని బెంగాల్‌లో ఉన్న మీ బంధుమిత్రులకు చెప్పాలని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.

# ఫస్ట్ టార్గెట్.. బీఆర్ఎస్

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి):** గులాబీ దళంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి దండెత్తారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావులను లక్ష్యంగా చేసుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన కవిత గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన ఫస్ట్ టార్గెట్ బీఆర్ఎస్ పార్టీ అని, నెక్స్ట్ బీజేపీ అంటూ సంచలన ప్రకటన చేశారు. వెరసి గులాబీ, కమల దళాలపై విరుచుకు పడ్డారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదని, ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారని కవిత సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాదయాత్రను తెలంగాణ ప్రజలను పట్టించుకోరన్నారు. ఒక్కసారిగా జ్ఞానోదయమై పాదయాత్రలు గుర్తొచ్చాయా? ప్రజలపై ప్రేమతో ఈ యాత్రలు చేయడం లేదని, అధికారాన్ని కోల్పోయామన్న ఆవేదనతోనే ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. హరీష్ రావుది కుట్రా రాజకీయమని, ఆయనను తాను ఎప్పటికీ నమ్మనన్నారు. గులాబీ దళంలో గ్రూపులు కట్టి, గ్రూపు రాజకీయాలను పెంచి పోషించింది ఆయనే అని కవిత ఆరోపించారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తనను కలిసి లోగుట్టు విప్పారని, అయితే వారి పేర్లు ఇప్పుడు బయటపెట్టనని స్పష్టం చేశారు. అలాగే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యే, కీలక నేతలు తనతో టచ్‌లో ఉన్నారని, పరిస్థితులను బట్టీ వారి పేర్లను ప్రకటిస్తానన్నారు.

**సామాజిక తెలంగాణ:**

అందరికీ అధికారం అందాలని తాను మాట్లాడటం మొదలుపెట్టాకే సమస్యలు ఎదురయ్యాయని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు. సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు మద్దతు తెలపడం కొండంత బలాన్ని ఇచ్చిందన్నారు. తన కొత్త పార్టీలో మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు కలిసి పనిచేస్తామనడంతో ఇక తమను ఆపే శక్తే లేదని కవిత ధీమా వ్యక్తం చేశారు. కుల సంఘాల కర్త, కర్మ, క్రియ...మారోజు వీరన్న కులాలు బలంగా ఉన్నప్పుడే వారికి రాజకీయ అధికారం దక్కుతుందని బలంగా నమ్మిన వ్యక్తి అని కవిత చెప్పారు. అందరినీ కూడకట్టుకుని సర్వోదయ తెలంగాణ' పేరుతో సరికొత్త రాజకీయ పంథాలో ముందుకు వెళ్తామని ప్రకటించారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కవిత ఈ సందర్భంగా వెల్లడించారు.

**వార్డు పదవీ పొందని:**

తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటికీ కనీసం గ్రామ వార్డు పదవి కూడా పొందని కులాలు ఎన్నో ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నప్పటికీ సామాజిక తెలంగాణ మాత్రం తెచ్చుకోలేకపోయామన్నారు. ఉద్యమ సమయంలోనే ఈ అంశాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ దగ్గర ప్రస్తావించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. భారత్‌కు స్వాతంత్రం వచ్చిన సమయంలోనూ గాంధీ, అంబేడ్కర్ ముందు కూడా ఇదే సమస్య వచ్చిందని...భారత కుల వ్యవస్థలో ఈ అంశం నిరంతరం మన ముందుంటుందని జయశంకర్ సార్ అన్నారన్నారు. ముందు మనం భౌగోళిక తెలంగాణ సాధించుకొని ఆ తర్వాత సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేయాలని సూచించారన్నారు. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడుస్తున్న ఇప్పటికీ ఎన్నో కులాలు అధికారానికి దూరంగా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు అధికారం కోసం జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని కవిత తేల్చిచెప్పారు.

**'మా'వోల బలం:**

మాజీ మావోయిస్టుల కోసం పోరాడుతామని, తెలంగాణ ఉద్యమంలో మాజీ మావోయిస్టులు లక్ష మంది వరకు పాల్గొన్నారని కవిత గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో వారంతా బీఆర్ఎస్ లో చేరి ఆ పార్టీ బలంగా మారేందుకు చోదక శక్తి అయ్యారన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారెవరికీ కూడా మేలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులు, తెలంగాణ అమరవీరుల కోసం ఏ విధంగా భూపోరాటం చేస్తున్నామో...మాజీ మావోయిస్టుల కోసం కూడా అదే విధంగా పోరాడుతామని కవిత హామీ ఇచ్చారు.

**తేజస్వీకి పిండ ప్రధానం:**

తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను నిరసనగా ఓయూలో పిండ ప్రదానం చేశారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ జాగృతి స్టేట్ సెక్రటరీ కందుల మధు, టీజేఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఎంతో మంది అమరుల ప్రాణ త్యాగాలపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే భౌతిక దాడులు చేసేందుకు కూడా వెనుకడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జాగృతి నేతలు సాయి నేత, మంతెన మధు పాల్గొన్నారు

## ఆయనొక్కడి కోసమే పోలింగ్ బూత్

**అహ్మదాబాద్, ఏప్రిల్ 17:** ఒకే ఒక్క ఓటరు కోసం గుజరాత్లోని గిర్ సోమనాథ్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటైంది. ఆ ఒక్క ఓటరు కోసం అధికారులు, సిబ్బందిని 20కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతానికి పంపుతోంది.

ఇందులో భాగంగా ప్రిసైడింగ్ అధికారి, సిబ్బంది, పోలీసు సిబ్బంది పోలింగ్కు ఒక రోజు ముందుగానే అటవీ ప్రాంతానికి చేరుకుని రాత్రంతా అక్కడే ఉంటారు. మహంత్ హరిదాస్ బాపు ఓటు హక్కును వినియోగించుకున్నాకే వీరంతా అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారు.

గతంలో బనేజ్ ప్రాంతానికి చెందిన మహంత్ భరత్ దాస్ బాపు తన ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రతి ఎన్నికల్లోనూ గిర్ సోమనాథ్లోని పోలింగ్ కేంద్రానికి వచ్చేవారు.

బనేజ్ ప్రాంతంలోని ఓ శివాలయం వద్ద నివసించేది ఆయన ఒక్కరే కావడంతో ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 2019లో ఆయన మరణించిన తర్వాత ఆ పోలింగ్ బూత్ను మూసివేయాలనుకున్నారు. అయితే, ఆయన శిష్యుడిగా మహంత్ హరిదాస్ బాపు రావడంతో.. ఆ పోలింగ్ బూత్ను కొనసాగిస్తున్నారు. గుజరాత్లో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ 26న ఎన్నికలు జరుగనున్నాయి.

# 'శంషాబాద్'లో హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖరీదైన హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఈక్రమంలో థాయ్ ఎయిర్వేస్ లో విమానంలో బ్యాంకాక్ నుంచి శుక్రవారం హైదరాబాద్ వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి ప్రవర్తనపై కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో ఆమె లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేయగా సుమారు 3 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి బయటపడింది. సాధారణ గంజాయితో పోలిస్తే దీని మత్తు తీవ్రత, అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర చాలా ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. సదరు మహిళను అదుపులోకి తీసుకున్న అధికారులు ఆమె కేవలం డ్రగ్స్ చేరవేసే కొరియర్' మాత్రమేనా..?, డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఈ డ్రగ్స్ ఎవరికి చేరవేసేందుకు ఆమె వచ్చిందనే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

**కొండాపూర్లో డ్రగ్స్ కలకలం**

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొండాపూర్లో డ్రగ్స్ కలకలం రేగింది. ఎక్సైజ్ అధికారులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 6.09 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారించడంతో డ్రగ్స్‌ను విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు తేలింది. మురళి అనే వ్యక్తి వికాస్, భరత్ చౌదరిలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కాగా నిందితులు ఇంటీరియర్ డిజైన్ వ్యాపారం ముసుగులో ఈ ముఠా అక్రమ దందా సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లగ్జరీ కార్లలో తిరుగుతూ ఒక గ్రాము ఎండీఎంఏ రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# పెండింగ్ సమస్యలపై శాంతియుత నిరసన

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్




**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం, ప్రత్యేక ప్రతినిధి)ః** దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సచివాలయం, లోక్ భవన్, అసెంబ్లీ, క్లాస్-3, 4 ఉద్యోగులు శాంతి యుతంగా నిరసన తెలిపారు. ఈక్రమంలో సచివాలయం ప్రాంగణంలో బాహుబలి గేటు వద్ద శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్, ఇతర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో 12:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. .ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ ప్రేమ్, ట్రెజరర్ కైలాష్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, ఇతర నాయకులు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని అమలును తక్షణమే పూర్తి చేయాలన్నారు. అలాగే ఉద్యోగులకు రావలసిన డియర్నెస్ అలవెన్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం సమగ్రంగా పనిచేసే కొత్త హెల్త్ స్కీంను అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు.

**ఉద్యోగులపై ఆర్థిక భారం ః**

ఇటీవల పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఉద్యోగులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణ ంగా జీతభత్యాలను సవరించడం ప్రభుత్వం బాధ్యతని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ ప్రేమ్‌లు గుర్తు చేశారు.ఉద్యోగులు నిబద్ధతతో ప్రజాసేవలో పనిచేస్తున్నప్పటికీ, వారి ప్రాథమిక అవసరాలు కూడా సక్రమంగా నెరవేరని పరిస్థితి కొనసాగుతుం డడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఉద్యోగుల సమస్య ల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని సచివాలయ సంఘాల నాయకులు , సచివాలయ అధికారులు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించ కూడదని, సమస్యలు త్వరితగతిన పరిష్కరిం చకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర స్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగులందరూ ఏకతాటిపై నిలిచి సమస్యలు నెరవేరేవరకు పోరాటం చేయాలని అన్నారు.

# డీజీపీ నియామక వివాదంపై విచారణ

## మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బి.శివధర్ రెడ్డి నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరించింది. రాష్ట్రంలో పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. ఈ క్రమంలో శివధర్ రెడ్డి నియామకం సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని, దీనిని రద్దు చేసి తక్షణమే పూర్తిస్థాయి డీజీపీని నియమించేలా ఆదేశాలివ్వాలని ధనగోపాల్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ.. పూర్తిస్థాయి డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోందని జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనానికి వివరించారు. ప్రభుత్వ వివరణను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ దశలో ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 27కు వాయిదా వేసింది.

# ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబు బెదిరింపు...!

**హైదరాబాద్,ఏప్రిల్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః** ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ ఉప్పల్ మెట్రో స్టేషన్‌ను ఆధీనంలోకి తీసుకుని అనుమానం వచ్చిన ప్రతి చోట క్షుణ్ణంగా తనికీలు చేపట్టింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మెట్రో స్టేషన్‌కు ఇరువైపులా సోదాలు చేసింది. అయితే బాంబు బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

# ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం

**డాక్టర్ సురేష్ నాయక్ ఆత్మహత్యపై సిఐడి విచారణకు డిమాండ్**

**విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సర్లతో అధ్యయనానికి కమిటీకి కుటుంబానికి తక్షణ సహాయం**



**వరంగల్, మనంన్యూస్ః** ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న గిరిజన విద్యార్థి డాక్టర్ సురేష్ నాయక్ అకాల మరణం అత్యంత దురదృష్టకరం మరియు బాధాకరమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు మోహన్ సింగ్ ఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖ. ఆయన మరణం వెనుక ఉన్న పరిస్థితులు చూస్తే, ఇది ఒక వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు - విద్యా వ్యవస్థలో కొనసాగుతున్న తీవ్రమైన లోపాలకు, ముఖ్యంగా ర్యాగింగ్ అనే దుష్ప్రవర్తనకు ప్రతీకగా కనిపిస్తోంది. ఈరోజుల్లో వైద్య విద్యలో పీజీ సీటు పొందిన విద్యార్థులు, తమకు ఇష్టం లేని బ్రాంచ్ వచ్చినా, మధ్యలో వదిలి వెళ్ళే అవకాశం లేకుండా 20 లక్షలు నుంచి 50 లక్షల వరకు భారీ బాండ్లతో బంధించబడుతున్నారు. ఈ విధానం విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని సృష్టిస్తోంది.సురేష్ నాయక్ ఉస్మానియా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో ఫ్రీ సీట్ ద్వారా చేరినా, అక్కడి సీనియర్ విద్యార్థుల నుండి ఎదురైన వేధింపులు, ర్యాగింగ్, అధిక పనిభారం కారణంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. తన సమస్యలను బయటపెట్టడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. కుటుంబ సభ్యులు అడిగినప్పుడు కూడా నా సమస్య నేనే పరిష్కరించుకుంటా అని చెప్పి తన బాధను లోపలే దాచుకున్నాడు. చివరికి ఈ ఒత్తిడిని తట్టుకోలేక అతను ప్రాణాలు తీసుకోవడం మన సమాజానికి

# సహకార రంగంలో ఆంధ్రప్రదేశ్కు నవ శకం

**కెడిసిసి విజయగాథపై సీఎం చంద్రబాబుతో చైర్మన్ రఘురాం కీలక చర్చలు**



**అమరావతి, ఏప్రిల్,18,(మనం ప్రతినిధి)ః** ంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అమరావతి సచివాలయంలో మాజీ మంత్రి, ఉమ్మడి కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (ఓ్యఇఇ) చైర్మన్ నెట్టెం రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సహకార బ్యాంకింగ్ రంగం బలోపేతం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, రైతు సంక్షేమం వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ గత కొన్నేళ్లలో సాధించిన ప్రగతిని వివరించిన చైర్మన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 106 కోట్ల లాభాన్ని నమోదు చేసి స్థిరమైన వృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఇది బ్యాంపు ప్రజల విశ్వాసానికి, సమర్థవంతమైన నిర్వహణకు నిదర్శనమని పేర్కొన్నారు.

సహకార రంగంలో డిజిటల్ మార్పుకు కెడిసిసి నాంది పలికిందని చైర్మన్ వివరించారు. అన్ని జిల్లా సహకార బ్యాంకుల్లో తొలిసారిగా యుపిఐ సేవలను విజయవంతంగా అమలు చేసిన ఘనత కృష్ణా జిల్లా బ్యాంక్కే దక్కిందని తెలిపారు. అలాగే 425 పిఎసియస్ సంఘాల 100% కంప్యూటరీకరణ పూర్తి కావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన సిబ్బంది, అధికారులు, భాగస్వామ్య సంస్థలను ముఖ్యమంత్రి అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ బ్యాంకింగ్ విస్తరణకు ఇది మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

రైతు సంక్షేమంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. రైతులకు అందిస్తున్న అంత్యక్రియల సహాయం, వ్యక్తిగత ప్రమాద బీమా, మరియు ఇతర సంక్షేమ పథకాల అమలుపై వివరంగా ఆరా తీశారు. ఈ పథకాలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా, ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, మరణించిన రైతుల కుటుంబాలకు వన్ టైం సెటిల్మెంట్ (ఓటియస్) ద్వారా వడ్డీ మాఫీ అమలు చేస్తున్నామని చైర్మన్ వివరించారు. ఈ చర్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తోందని, సహకార బ్యాంకింగ్ రంగంపై విశ్వాసం మరింత పెరుగుతోందని తెలిపారు.సహకార రంగ అభివృద్ధి, రైతు సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కెడిసిసి బ్యాంక్ ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి ఉన్నామని చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు.

# విజయవాడలో రాస సిల్వర్ ఆవిష్కరణ



**విజయవాడ 16 ఏప్రిల్ 2026 :** భారదేశంలో వెండి ఆభరణాల తయారీలో విశిష్ట అనుభవం కలిగిన రాస సిల్వర్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో అడుగు పెట్టింది. బెంగుళూరు నగరంలో స్థాపితమైన రాస సిల్వర్ జ్యువెల్స్ బ్రాండు వారసత్వ అనుభవముతో తమ బ్రాండు ఆభరణాలతో ఆంధ్రప్రదేశ్ లో కూడ సుస్థిర స్థానం సాధించే లక్ష్యంతో విజయవాడలో ప్రవేశించినది. ఆభరణాలకు ఒక మంచి గుర్తింపు, సంప్రదాయత మరియు భావవ్యక్తీకరణలకు నిలయమైన విజయవాడలో రాస సిల్వర్ ఆవిష్కరణ ఒక అద్భుతమైన వేదిక.

రాస సిల్వర్ షోరూం నందు ఒక మహిళ తానూ చిన్న నాటినుండి కోరుకునే వేలాది రకాల ఆభరణాలును ఆమె ముందు తెస్తుంది. ఆమె రోజు వారు ధరించాలి, వేడుకల సమయంలో ధరించాలి, తను పెళ్ళికూతురుగా ధరించాలి అనుకునే ఆమె ఉహించుకునే అభిరుచికి తగిన ఎన్నో రకాల ఆభరణాలు ఈ షోరూం నందు ఆమె కోసం ఎదురు చూస్తుంటాయి. ఇక్కడ ప్రతి ఆభరణం 925 వన్నె వెండితో కళాకారులు బంగారు ఆభరణాలకు ఏ మాత్రం తగ్గేది లేదు అన్న రీతిలో అద్భుతంగా రూపొందిస్తారు. వీటిలో అన్ కట్ కుందన్ గ్లాస్ వర్క్, రత్నాలు పొదిగిన ఆభరణాలు, టెంపుల్ ఆభరణాల ప్రేరణతో క్లాసిక్ పోల్కీ, జదావ్, నవరత్న శైలిలో నిపుణులైన కళాకారుల చేతిలో అత్యంత నైపుణ్యంగా తీర్చిదిద్దుకుంటాయి. రాస సిల్వర్ షోరూం నందు ప్రతి ఆభరణం ధరించటానికే తయారు చేస్తారు. ఆభరణాలను దాచిపెట్టుకుని ఏదో పండుగ వస్తేనో, వేడుకలకో మాత్రమే ధరించటానికి కాదు.

రాసా సిల్వర్ ప్రారంభం సందర్భంగా మానస్ బోహ్రా, సహ-వ్యవస్థాపకులు, రాసా సిల్వర్ జ్యువెల్స్ వారు మాట్లాడుతూ, ఖాతాదారులు ఆభరణాలు ధరించినపుడు పొందే భావోద్వేగం మరియు వారి మానసిక అనుభూతి ఆధారంగా మేము ఆభరణాలను రూపొందిస్తాము అన్నారు. విలాసవంతంగా ఆభరణాలు ధరించాలి అనుకునే వారికి వాటి ధర అడ్డంకి కాకూడదు. మేము ఆంధ్రప్రదేశ్ మార్కెట్ లోనికి నూతనంగా ప్రవేశించి నప్పటికీ ఆభరణాల డిజైన్స్, నాణ్యత, హస్తకళా నైపుణ్యాలలో ఎలాటి రాజీ పడే ప్రసక్తి లేకుండా అన్ని రకాల ఆభరణాలను అందరికి అందుబాటులోనికి తెస్తాము అన్నారు. విజయవాడ నగరం ఆభరణాలు సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు, అందుకు తగిన విధంగా మేము ఆభరణాలు తయారు చేసి అందిస్తామనే విశ్వాసం ఆయన వ్యక్తపరిచారు. రాసా సిల్వర్ తమ వారసత్వ సంపదతో ప్రతి మహిళా తానూ ఉహించుకునే ఆభరణాన్ని ధరించి అద్దం ముందు నిలబడి పొందే గొప్ప అనుభూతిని రాసా అందిస్తుంది. ఆభరణాలు ఎప్పుడో ధరించి విలాసవంతమైన అనుభూతి పొందటం కాదు, రాసా ఆభరణాలు ప్రతి రోజు ధరించి, తమ ప్రతి బింబం అద్దంలో చూసుకుని గర్వపడాలి. ఆభరణం ఆడంబరంగా మాత్రమే కాక తమ ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలవాలి. రాసా సిల్వర్ విజయవాడ నగరంతో ఆగిపోదు, తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రముఖ నగరాలకు విస్తరిస్తుంది. రాసా వెండి ఆభరణాలు ప్రతి ఇంట, ప్రతి నగరంలోను చివరకు ప్రపంచం నలుమూలలకు విస్తరించాలి.

# హైకోర్టు న్యాయమూర్తి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**విశాఖపట్నం, ఏప్రిల్ 17:** జిల్లాలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శుక్రవారం



సాయంత్రం పరిశీలించారు. ఎండాడ సన్ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కన నిర్మించనున్న జ్యుడిషియల్ బిల్డింగ్ శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం ఎంత సేపు ఉంటుంది.. ఎంతమంది హాజరవుతారు అనే విషయాలను పక్కగా తెలుసుకొని దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని భీమిలి ఆర్డీవో, జీవీఎంసీ అధికారులకు సూచించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా, అతిథులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# చిన్న పొరపాట్లతో.. పెద్ద దిక్కున కోల్పోతున్నారు

## కరీంనగర్, సిద్దిపేట అరైవ్ అలైవ్‌లో డిజిపి బి శివధర్ రెడ్డి వెల్లడి




**హైదరాబాద్ : ఏప్రిల్ 17(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః** చిన్న చిన్న పొరపాట్లతో రోడ్డు ప్రమాదాలకు గురై అనే కుంటుబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతున్నారని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈక్రమంలో కరీంనగర్, గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో జరిగిన సదస్సుల్లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పాల్గొని వాహనదారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వాహనాలలో ప్రయాణంచేటప్పుడు మనం ఆలోచించే లోపే ప్రమాదం జరిగిపోతుందని, ఆ సమయంలో రియాక్షన్ టైమ్ కూడా ఉండదన్నారు. నేపథ్యంలో ప్రయాణించే సమయంలో నిరంతర అప్రమత్తత అవసరమని డిజిపి స్పష్టం చేశారు. హైవేలపై ఎల్లప్పుడూ ఎడమ వైపు ట్రాక్ లోనే ప్రయాణించాలని, కేవలం ఓవర్టేక్ సమయంలో మాత్రమే కుడి వైపునకు వెళ్లి, వెంటనే తిరిగి ఎడమ వైపునకు వచ్చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో ఎదురుగా వాహనం వచ్చినప్పుడు తప్పకుండా 'లో-బీమ్' వాడాలని, గ్రామాల గుండా వెళ్లేటప్పుడు కూడా ఇదే పద్ధతి పాటించాలని తెలిపారు.

**హత్యల కన్నా..ః**

గతేడాది రాష్ట్రంలో హత్యల వల్ల 800 మంది చనిపోతే, రోడ్డు ప్రమాదాల వల్ల 7,500 మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని డీజీపీ వివరించారు. రోడ్డు ప్రమాదాలను ఒక సామాజిక ఉద్యమంగా ఎదుర్కోవాలని, హెల్మెట్ స్ట్రాప్ గట్టిగా పెట్టుకోవడం, కారులో ముందు వెనుక సీట్లలో కూర్చునే వారందరూ సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరన్నారు. గ్రామీణ రోడ్ల నుండి హైవేపైకి వచ్చేటప్పుడు ఒక్క నిమిషం ఆగి చూసి రావాలని, పెద్ద వాహనాలకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఉండాలని డిజిపి సూచించారు. కాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీలో రాష్ట్ర జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించగలమన్నారు. రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డు నిబంధనలు పాటిస్తామని తీర్మానాలు చేయడం శుభపరిణామన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా రోడ్డు భద్రత లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**మిన్నంటిన అరైవ్..అలైవ్ ః**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు మిన్నంటాయి. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హెల్మెట్ ధరించే వాహనదారులకు ఉచితంగా ఐపీఎల్ మ్యాచ్ చూపిస్తామని వినూత్న ప్రకటన చేశారు. వికారాబాద్‌లో అదనపు డీజీపీ స్వాతి లక్రా, కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా రోడ్డు భద్రతతో పాటు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్‌పైఅవగాహన కల్పించారు. నల్లగొండ మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యతను వివరించారు. ఖమ్మంలో అడిషనల్ డీసీపీల ఆధ్వర్యంలో 15 స్టేషన్ల పరిధిలో డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ అంకిత్ గిరిజన యువతకు హెల్మెట్లు పంపిణీ చేశారు. వనపర్తిలో ఐజీపీ గజరావు భూపాల్, సిరిసిల్లలో ఐజీపీ రమేష్ నాయుడు డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణను పర్యవేక్షించారు. రామగుండంలో యమధర్మరాజు వేషధారణతో ప్రజలను ఆలోచింపజేయగా, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా సీపీఆర్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. మహబూబ్ నగర్, జగిత్యాల, సంగారెడ్డి, కామారెడ్డి, గద్వాల జిల్లాల్లోనూ కలెక్టర్లు, ఎస్పీల ఆధ్వర్యంలో వినూత్న ప్రచారాలు నిర్వహించి అరైవ్ అలైవ్ కార్యక్రమం ఐదో రోజున ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# ఆచంటలో నవధాన్యాల సాగుపై శిక్షణ రైతులకు అవగాహన




**ఆచంట, ఏప్రిల్ 17 మనం న్యూస్ః** ఆచంట మండలంలోని వల్లూరు గ్రామంలో శుక్రవారం రైతు సేవా కేంద్రాల,ఏపీ సిఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) సిబ్బందికి నవధాన్యాల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకొల్లు ఏడీఏ పి మురళీకృష్ణ,మండల వ్యవసాయ అధికారి బి నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏడీఏ పి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆచంట మండలంలో నవధాన్యాల సాగును 1000 ఎకరాల్లో విస్తరించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. తొలి విడతగా 400 నవధాన్యాల కిట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.ఈ కిట్లలో తొమ్మిది రకాల విత్తనాలను కలిపి 10 కిలోల ప్యాకేజీగా అందిస్తున్నట్లు, ఒక్క కిట్ ధర రూ.700గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ కిట్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొని రైతులు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.తదనంతరం వ్యవసాయ అధికారి బి నాగరాజు మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల నేలలో నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఈ పంటల ద్వారా వచ్చే పచ్చిరొట్టను చేలో కలియదున్నడం వల్ల ఎకరానికి సుమారు రెండు టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని తెలిపారు. దీంతో నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. రైతులు ఈ విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీ సిఎన్ఎఫ్ మండల కన్వీనర్ జి లలిత, వ్యవసాయ విస్తరణ అధికారి గుబ్బల నరేష్, రైతు సేవా కేంద్రాల ఇన్చార్జులు,ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## వేసవి వేధింపులు!

ఆకాశం
నీళ్లనే కాదు నిప్పులను కురిపిస్తది
పైన ఎవరో మంట పెట్టినట్లు!

అవసరం కొద్దీ పగలు
గడప దాటాలంటేనే
సీతమ్మ అగ్ని ప్రవేశం యాదికొస్తున్నది!

ఎన్ని నీళ్లు తాగినా
కడుపుబ్బరమే కానీ
ఈ దేహానికి తాపం తీరదు!
కాస్త మనసు కుదుటపడటానికి
ప్రియురాలి కొరకు నిరీక్షించినట్లు
సాయంకాలం కోసం ఎదురుచూపు!

ఇక రాత్రా
నల్లని గొడుగు పట్టినట్లున్నా
అది నివురు గప్పిన నిప్పే!
పానీయాలొక్కటే
ఈ వేసవిని ధిక్కరించే
ప్రాణదాతలు!

వేకువ జామున
కిటికీలోంచి తొంగి చూసే పిల్ల తెమ్మెర
జీవనకాంక్షలకు ఊపిరి పోస్తున్నది!

ఈ రాత్రి కాస్త నేను
అదమరచి నిద్రపోవడానికి
నీళ్లు కొన్ని ఐసు ముక్కల్ని వేడుకుంటున్న!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

# దక్షిణాదిపై ఢిల్లీ దండయాత్ర?





భారత ప్రజాస్వామ్య చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సమాఖ్య వ్యవస్థపై గొడ్డలి పెట్టు వంటి నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం తెరలేపింది. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం అయిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు దేశ భవిష్యత్తును వెలిగించడానికో లేక దక్షిణాది రాష్ట్రాల గొంతు నులమడానికో అన్నట్టుగా మారిపోయాయి. లోక్‌సభ మరియు అసెంబ్లీ స్థానాల సంఖ్యను అమాంతం పెంచే నెపంతో, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టేందుకు ఢిల్లీ పీఠం సిద్ధమైంది. అయితే, పాతబడిపోయిన 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఈ సరిహద్దుల మార్పులు చేపట్టాలని చూడటం కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు. ఇది దక్షిణాది ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి, రాజకీయంగా వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రగా కనిపిస్తోంది. హడావుడిగా నియోజకవర్గాలను విస్తరించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ప్రజాస్వామ్య వికాసం కంటే రాజకీయ ఆధిపత్యమే అని స్పష్టమవుతోంది.

**జనాభా నియంత్రణ పాటించినందుకు రాజకీయ ఉరిశిక్ష**

దక్షిణాది రాష్ట్రాలు గత ఐదు దశాబ్దాలుగా జాతీయ క్రమశిక్షణను తూచా తప్పకుండా పాటిస్తూ, జనాభా నియంత్రణలో ఆదర్శవంతమైన ఫలితాలను సాధించాయి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు తమ వనరులను విద్య, వైద్యంపై వెచ్చించి జనాభా పెరుగుదలను అదుపులోకి తెచ్చాయి. కానీ, ఇప్పుడు కేంద్రం ప్రతిపాదిస్తున్న పునర్విభజన సూత్రం ఈ రాష్ట్రాల పాలిట శాపంగా మారుతోంది. జనాభా నియంత్రణను విజయవంతం చేసినందుకు ఈ రాష్ట్రాలకు గౌరవం దక్కాల్సింది పోయి, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించి 'ఉరిశిక్ష' వేయాలని చూడటం అత్యంత శోచనీయం. మరోవైపు, జనాభా విస్ఫోటనం చెందిన ఉత్తరాది రాష్ట్రాలకు కేవలం జనాభా ప్రాతిపదికన అత్యధిక సీట్లు కట్టబెట్టడం అంటే, అక్రమంగా రాజకీయ అధికారాన్ని ఒకే ప్రాంతం వైపు దారి మళ్లించడమే.

ఇది అభివృద్ధి చెందిన రాష్ట్రాలను శిక్షించి, వెనుక బడిన లేదా క్రమశిక్షణ లేని ప్రాంతాలకు పట్టం కట్టడం వంటిది.

**రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన ఆర్థిక భాగస్వామ్య నమూనా**

ఈ అన్యాయమైన ప్రక్రియను అడ్డుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక శక్తివంతమైన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. కేవలం మనుషుల తలల గణన (జనాభా) మాత్రమే కొలమానం కాదని, దేశ నిర్మాణంలో ఏ రాష్ట్రం ఎంత ఆర్థిక సహకారం అందిస్తోందనే అంశాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకోవాలని ఆయన గర్జించారు. దేశానికి అత్యధిక పన్నుల ఆదాయాన్ని సమకూరుస్తూ, జాతీయ స్థూల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అదనంగా పెంచే సీట్లలో సగం మాత్రమే జనాభా ప్రాతిపదికన కేటాయించి, మిగిలిన సగం ఆయా రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి మరియు పనితీరు ఆధారంగా కేటాయించే 'హైబ్రీడ్ నమూనా'ను ఆయన ప్రతిపాదించారు. ఈ డిమాండ్ ఇప్పుడు ఢిల్లీ పీఠం పునాదులను కదిలిస్తోంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించే రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కాపాడటం ప్రజాస్వామ్య ధర్మమని ఆయన చాటిచెప్పారు.

**మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయ వ్యూహం**

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్' బిల్లును పునర్విభజనతో ముడిపెట్టడం కేంద్రం చేసిన ఒక వ్యూహాత్మక కుతంత్రంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళా సాధికారతపై నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, సీట్ల పెంపుతో సంబంధం లేకుండా ఇప్పుడే రిజర్వేషన్లు అమలు చేయవచ్చు. కానీ, మహిళా రిజర్వేషన్లు కావాలంటే పునర్విభజన జరగాల్సిందేనని షరతు పెట్టడం వెనుక ఉన్న అసలు కారణం దక్షిణాది గొంతు కోయడమేనని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. సోనియా గాంధీ వంటి సీనియర్ నేతలు ప్రశ్నిస్తున్నట్లుగా, 2027లో కొత్త జనాభా లెక్కలు రానున్న తరుణంలో, 15 ఏళ్ల క్రితం నాటి పాత గణాంకాలతో ఈ పందెం ఆడాల్సిన అవసరం ఏముంది? ఇది కేవలం మహిళా సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని, దక్షిణాది రాజకీయ ప్రాధాన్యతను నాశనం చేసే వ్యూహం కాదా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**సమాఖ్య వ్యవస్థ సమతుల్యతకు ఎదురవుతున్న సవాలు**

భారతదేశం వివిధ భాషలు, సంస్కృతులు గల రాష్ట్రాల సముదాయం. ఇక్కడ ఒక ప్రాంతం మరొక ప్రాంతంపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తే దేశ సమగ్రతకే ప్రమాదం. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హెచ్చరించినట్లుగా, ఈ పునర్విభజన సమాఖ్య స్ఫూర్తిని సమాధి చేసేలా ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఇది 'తమిళనాడుకు చివరి హెచ్చరిక' అని పేర్కొంటూ, తమ రాష్ట్ర హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని గర్జించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం రాజకీయ లబ్ధి కోసం దేశాన్ని ముక్కలు చేసే ప్రయత్నంగా దీనిని అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం తనకున్న మెజారిటీ బలంతో దక్షిణాది ఆత్మగౌరవాన్ని తొక్కివేయాలని చూస్తే, అది దేశంలో మరో ప్రజా ఉద్యమానికి దారితీసే అవకాశం ఉంది.

అభివృద్ధిని, ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే, చరిత్ర క్షమించదని పాలకులు గుర్తించాలి. ఇప్పటికైనా ఢిల్లీ తన మొండి వైఖరిని వీడి, దక్షిణాది ఆవేదనను ఆలకించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# రిజర్వేషన్లతో సాధికారత దక్కేనా?





మహిళా రిజర్వేషన్- దీని చుట్టూ దశాబ్దాలుగా సాగుతున్న చర్చలు ఇప్పుడు మళ్లీ వేడెక్కాయి. మహిళలకు శాసనసభలు, పార్లమెంట్లో స్థానం కల్పించాలన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ విధానం, సమాన ప్రతినిధిత్వానికి ఒక సాధనంగా భావించబడుతోంది. అయితే, ప్రశ్నలు మాత్రం ఇంకా అలాగే ఉన్నాయి. మహిళా రిజర్వేషన్ వల్ల నిజంగా లాభం ఏంటి? సమాజం ఏం ఆశిస్తోంది? ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ఇప్పటికే రిజర్వేషన్ ఉన్నా ఎందుకు మహిళలు పెద్ద స్థాయికి ఎదగలేక పోతున్నారు?

మొదటగా మహిళా రిజర్వేషన్ వల్ల ఆశించే ప్రధాన లాభం ప్రతినిధిత్వం. జనాభాలో సగం ఉన్న మహిళలు రాజకీయాల్లో కూడా సమానంగా ఉండాలి అన్న భావన ప్రజాస్వామ్యానికి మూల సూత్రం. ఈ విధానం ద్వారా మహిళల సమస్యలు- భద్రత, ఆరోగ్యం, విద్య, ఉపాధి-నేరుగా చర్చకు వస్తాయని భావిస్తున్నారు. మహిళల దృష్టికోణం పాలనలో చేరితే నిర్ణయాలు సమగ్రంగా ఉంటాయని ఆశ.

అయితే, ఇది సిద్ధాంత పరంగా మాత్రమే సరైనది. ప్రాక్టికల్గా చూస్తే, స్థానిక సంస్థల్లో (పంచాయతీలు, మున్సిపాలిటీలు) మహిళలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉంది. కానీ అక్కడి నుండి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన మహిళల సంఖ్య చాలా తక్కువ. కారణం స్పష్టమే. నిజమైన అధికారంలో మహిళలు లేరు, పేరుకు మాత్రమే ఉన్నారు.

గ్రామాల్లో మనం తరచూ చూసేది సర్పంచ్ మహిళ- పెత్తనం భర్త అనేది వాస్తవం. మహిళ పేరు మీద పదవి వచ్చినా, అధికారాన్ని వినియోగించేది మగవాళ్లే. దీనిని ప్రాక్సీ పాలన అని కూడా అంటారు. అంటే, రిజర్వేషన్ ఉన్నా, మహిళలకు నిజమైన శక్తి అందడం లేదు. ఇది రిజర్వేషన్ యొక్క అసలు ఉద్దేశానికే విరుద్ధం.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది. రిజర్వేషన్ సరిపోతుందా? సమాధానం కాదు. రిజర్వేషన్ ఒక ద్వారం మాత్రమే. కానీ ఆ ద్వారం దాటే సామర్థ్యం, అవగాహన, ధైర్యం లేకపోతే ప్రయోజనం ఉండదు. మహిళలకు రాజకీయ అవగాహన, నాయకత్వ శిక్షణ, ఆర్థిక స్వావలంబన లేకపోతే, వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేరు. ఇంకో ఆసక్తికరమైన, ప్రధానమైన అంశం ఏంటంటే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ లేకపోయినా, వారు దేశాధ్యక్షులుగా, ప్రధానమంత్రులుగా ఎదిగారు. ఇందుకు కారణం అక్కడి సమాజంలో ఉన్న సమాన అవకాశాలు మరియు లింగ సమానత్వం. అంటే, అక్కడ మహిళలు తమ శక్తి, ప్రతిభతో ముందుకు వచ్చారు-రిజర్వేషన్ వల్ల కాదు.

అందుకే, మన దేశంలో కూడా కేవలం రిజర్వేషన్ మీద ఆధారపడకుండా, మహిళలకు స్వయం సాధికారత (self&empowerment) కల్పించాల్సిన అవసరం ఉంది. విద్య, ఉపాధి, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక గౌరవం-ఇవి ఉంటే మహిళలు సహజంగానే నాయకత్వంలోకి వస్తారు.

మరొక సమస్య.. రిజర్వేషన్ వల్ల రాజకీయ పార్టీలలో టోకెన్ పాలిటిక్స్ పెరగడం. కొన్ని పార్టీలకు మహిళలు కేవలం సంఖ్యలు నింపేందుకు ఉపయోగపడుతున్నారు. ఇది నిజమైన నాయకత్వాన్ని ప్రోత్సహించదు. పైగా, అర్హత కంటే సంబంధాలు, కుటుంబ నేపథ్యం ప్రాధాన్యం పెరుగుతుంది. ఫలితంగా, నిజంగా కష్టపడి ఎదగాలనుకునే మహిళలకు అవకాశాలు తగ్గిపోతాయి.

అయితే, రిజర్వేషన్ పూర్తిగా అవసరం లేదని కూడా చెప్పలేం. ఇది ప్రారంభ దశలో ఒక ప్రోత్సాహకంగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను రాజకీయాల్లోకి తీసుకురావడంలో ఇది ఒక కీలక పాత్ర పోషించింది. కానీ అక్కడే ఆగిపోతే ప్రయోజనం లేదు. ఆ మహిళలు పై స్థాయికి ఎదగడానికి మెంటరింగ్, శిక్షణ, స్వతంత్ర నిర్ణయాధికారం అవసరం.

చివరగా, మహిళా సాధికారత అంటే కేవలం పదవులు ఇవ్వడం కాదు-శక్తి ఇవ్వడం. నిర్ణయాలు తీసుకునే ధైర్యం, ఆర్థికంగా నిలబడే సామర్థ్యం, సామాజికంగా గౌరవం పొందే స్థాయి రిజర్వేషన్ ఒక మార్గం మాత్రమే, గమ్యం కాదు.

మహిళలు నిజంగా ఎదగాలంటే, వారి మీద నమ్మకం పెట్టుకోవాలి. కుటుంబం నుండి సమాజం వరకు, వారికి స్వేచ్ఛ ఇవ్వాలి. మహిళా నాయకురాలు అనేది ఒక కోటా వల్ల వచ్చిన గుర్తింపు కాకుండా, తన ప్రతిభతో సంపాదించిన గుర్తింపు కావాలి. అప్పుడే మహిళా రిజర్వేషన్ నిజమైన అర్థం సాధిస్తుంది. లేదంటే, ఇది కేవలం పేరుకు మాత్రమే మిగిలిపోతుంది. ఈ రిజర్వేషన్ సమస్య ఎప్పటి నుంచో నలుగుతోంది. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా బిల్లును పెట్టాలనే ప్రతిపాదనలు వచ్చాయి. అప్పుడు మోకాలడ్డింది ఏవరో? ఈ చిక్కు రిజర్వేషన్లది కాదు.. డీలిమిటేషన్‌ది అన్నది ఇందులోని అంతరార్థం..

**- ఎల్లబోయిన వెంకటేశ్వర్లు**
8184940814

# అఖండ భారత దిశగా కమలదళం



గత రెండు దశాబ్దాలుగా విడతలవారీగా ఒక్కోసారి బీజేపీతో, మరోసారి ఆర్జేడీ మద్దతుతో ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్, గత ఏడాది ఎన్నికల ఒప్పందం ప్రకారం స్వచ్ఛందంగా పదవి వదులు కోవడంతో బిహార్ బీజేపీ ఖాతాలో చేరింది. ఈ చారిత్రక పరిణామంతో దేశంలో బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల సంఖ్య 16కి చేరింది.

బీజేపీ నేతృత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం బిహార్ లో బాధ్యతలు చేపట్టడం రాజకీయ పరిపక్వతకు, ప్రజాస్వామ్య స్థిరత్వానికి నిదర్శనం. ఇది ప్రజలలో బీజేపీ పాలనపై ఉన్న అచంచలమైన నమ్మకాన్ని మరోసారి రుజువు చేసింది.

ప్రస్తుత దేశీయ రాజకీయ చిత్రణను పరిశీలిస్తే, బీజేపీ స్వంత ముఖ్యమంత్రులతో 16 రాష్ట్రాలను పాలిస్తుండగా, మరో మూడు రాష్ట్రాల్లో బీజేపీ మద్దతుతో భాగస్వామ్య పార్టీలు ప్రభుత్వాలు నడుపుతున్నాయి. దీంతో మొత్తం 19 రాష్ట్రాల్లో ఎన్.డి.ఏ ప్రభుత్వాలు ఉన్నట్లవుతుంది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు కాషాయ జెండా రెపరెపలాడుతోంది.

ఈ విస్తరణకు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా దూరదృష్టి, అవిశ్రాంత కృషి ప్రధాన కారణం. వారి నాయకత్వంలో బీజేపీ దక్షిణాది, తూర్పు, పశ్చిమ, ఉత్తరం - అన్ని ప్రాంతాల్లోకి విజయవంతంగా విస్తరించింది.

బీజేపీ అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం దాని సుపరిపాలన (Good Governance). ప్రధాని మోదీ పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలనను అందించారు. డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, ఉజ్వల యోజన, జన్ ధన్ ఖాతాలు, ఆయుష్మాన్ భారత్ - ప్రతి పథకం అవినీతి రహితంగా, లబ్ధిదారులకు నేరుగా చేరుతోంది. ప్రజలు ఈ మంచి పాలనను చూసి, ఇదే మోడల్ తమ రాష్ట్రంలోనూ రావాలని కోరుకుంటున్నారు. అందుకే ప్రతి ఎన్నికలో బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతూనే ఉంది.

'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఆత్మనిర్భరం (Self&sustaining) చేయడానికి కృషి చేస్తోంది. ఈ పథకం ఫలితంగా, భారతదేశం ఇప్పుడు రక్షణ పరికరాలు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులను స్వదేశీంగా తయారు చేసుకుంటోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రికార్డు స్థాయిలో వస్తున్నాయి. ఆపిల్, సామ్‌సంగ్, టెస్లా వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్లో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ఆర్థిక వృద్ధి వల్ల లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించబడుతున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఈ వృద్ధిలో ముందంజలో ఉండటం విశేషం.

ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికపై గౌరవప్రదమైన స్థానాన్ని పొందింది. ఎ20 అధ్యక్షతను విజయవంతంగా నిర్వహించి, 'వసుధైవ కుటుంబకమ్' సందేశాన్ని ప్రపంచానికి అందించింది. క్వాడ్, షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్, బ్రిక్స్ లో భారత్ చురుకైన పాత్ర పోషిస్తోంది. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు భారత్తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి. ఈ విదేశాంగ విజయాలు దేశ ఆర్థిక వృద్ధికి, భద్రతకు తోడ్పడుతున్నాయి. ప్రపంచంలో భారత్ పలుకుబడి పెరగడం వల్ల ప్రతి భారతీయుని గర్వం పెరిగింది.

ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోని అతిపెద్ద బలం పారదర్శకత (Transparency). గత ప్రభుత్వాల్లో ఉన్నంత అవినీతి ఇప్పుడు లేదు. ప్రతి ప్రభుత్వ ఖర్చు డిజిటల్ గా నమోదు అవుతోంది. ప్రధాని మోదీ స్వయంగా తన జీతం, ఆస్తులను బహిరంగంగా ప్రకటిస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా మధ్యవర్తుల దోపిడీ పూర్తిగా తగ్గింది. నమో, స్వచ్ఛ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు ప్రజలకు నేరుగా చేరుతున్నాయి. ఈ పారదర్శక పాలనను ప్రతి రాష్ట్రంలోని ప్రజలు తమ రాష్ట్రంలోనూ కావాలని కోరుకోవడం సహజమే.ప్రధాని మోదీ ఆర్థిక సంస్కరణల ఫలితంగా, భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, వరల్ బ్యాంక్ నివేదికల ప్రకారం, త్వరలోనే భారత్ 3వ స్థానానికి చేరుకుంటుంది. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా పథకాలు యువతకు ఉపాధి కల్పిస్తున్నాయి.

దేశ జీడీపీ వృద్ధి రేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. ఈ ఆర్థిక బలం వల్ల దేశంలోని ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందు తుంది. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు దేశ జీడీపీకి ఎక్కువగా తోడ్పడుతున్నాయనేది గణాంకాల నిజం.

రాబోయే ఎన్నికలపై దృష్టి పెడితే, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ (స్థానిక సంస్థల ఎన్నికలు) లో బీజేపీ తన జెండాను ఎగురవేయడానికి సిద్ధంగా ఉంది. పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా ఆగ్రహం పెరిగింది. కేరళలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాలతో కూరుకుపోయింది. తమిళనాడులో ద్రవిడ పార్టీల ప్రభుత్వం అసమర్థంగా ఉంది. ఈ రాష్ట్రాల ప్రజలు ఇప్పుడు మార్పు కోసం, సుపరిపాలన కోసం బీజేపీ వైపు చూస్తున్నారు. అన్ని సర్వేల ప్రకారం, రానున్న రోజుల్లో ఈ రాష్ట్రాలు కూడా ఎన్.డి.ఏ కూటమిలో చేరనున్నాయి. దేశంలో ఇక బీజేపీయే ఏకైక ప్రత్యామ్నాయం.

మొత్తంమీద, బీజేపీ విస్తరణ అనేది ప్రజల ఆకాంక్షలకు, ప్రధాని మోదీ దూరదృష్టికి ప్రతిబింబం.

'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస' అనే మంత్రాన్ని నిజ జీవితంలో అమలు చేస్తున్న బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఉంది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు - ప్రతి మూలన కమలదళం గాలి వీస్తోంది. ఈ విజయగాథ 'అఖండ భారత్' సంకల్పాన్ని బలపరుస్తుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ గురువుగా ఎదగడం ఖాయం. రానున్న రోజుల్లో మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ కాషాయ తరంగంలో మునిగిపోతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. జై హింద్, జై భారత్!

**- డాక్టర్ ఏలూరు యాదయ్య**

# శ్రామిక శక్తి - ప్రపంచ ప్రగతి

మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే, యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, 'సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు' అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' (International Labour Office & ILO). ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది.

19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ, కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్స్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందించినా, అది క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అవసరమైన సమతుల్యత దొరుకుతుంది. ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. 'పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు' అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ మరియు సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూలమని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటి వరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందించింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం, వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు.

ప్రస్తుతం 187 సభ్య దేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'( గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది.

భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుండి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దుకున్నాయి. అయితే గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది.

నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు, యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడటమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం.

గత వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుండి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు - ఎడిటర్

# ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం

- అంగన్వాడీ సేవలు డిజిటల్ విధానంతో మెరుగుపడుతాయి
- పిల్లలు,గర్భిణీ స్త్రీలకు అందించే అన్నిసేవలు సులభతరం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






జగిత్యాల ఏప్రిల్ 17( మనం ప్రతినిధి)ః మహిళ అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంను జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయో వృద్దులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరిగి, లబ్ధిదారులకు సమయానుకూల సేవలు అందుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వానికి అంగన్వాడీ కేంద్రాల్లోని సేవలను నివేదించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. జిల్లాలోని 1065 అంగన్వాడీ కేంద్రాలకు దాదాపు 100 ఉచిత మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం 992 మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మొబైల్ ఫోన్ లను సద్వినియోగం చేసుకుని సమాచారం ప్రభుత్వానికి సకాలంలో అందించాలని కోరారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలని అలాగే గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పెద్దన్న లాగా కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మన తెలంగాణ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా సాధికారిత కోసం కంకణం కట్టుకుంది అందులో భాగంగానే జగిత్యాల జిల్లాలోని మహిళలకు పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్, అద్దె బస్సులు, వడ్డీ లేని రుణాలు అందించడం జరిగిందని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లను జిల్లాలోని అన్ని వర్గాల పేదలకు పారదర్శకంగా అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మీకు అన్నగా మీకు అండగా మా ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుంటుంది. మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టాం అందులో భాగంగానే విద్యా, వైద్యం కొరకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం దీనిలో భాగంగా అంగన్వాడీల సేవలు వేగంగా పారదర్శకంగా మరియు నాణ్యంగా అందేందుకు మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందని ఈ సేవలను పూర్తిగా వినియోగించుకొని పూర్తి స్థాయి సేవలు అందించాలని కోరారు.అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని 1065 అంగన్వాడీ కేంద్రాలకు దాదాపు 992 మంది టీచర్లకు, సూపర్ వైజర్లకు మొబైల్ ఫోన్ లు అందిస్తున్న నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మొబైల్ ఫోన్ ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా అమలు అవుతుండటం ఆనందదాయకమని, అంగన్వాడీ సేవల మెరుగుదల కోసం ప్రభుత్వం మరింత చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో 235 కోట్ల తో ఇటీవలే మెడికల్ కాలేజీ లో క్రిటికల్ కేర్ మరియు మందుల కొరకు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధి కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ లు తీసుకునే అంగన్వాడీ టీచర్లు భాద్యతాయుతంగా ఫోన్ లు ఉపయోగించాలని కోరారు. వీటితో పాటు జగిత్యాల పట్టణం మరియు బీర్ పూర్ లో స్కూల్స్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొత్తగా ఏర్పడ్డ నూకపెల్లి అర్బన్ కాలనీలో 3 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయగా జనాభా దృష్ట్యా మరొక 3 నుండి 5 వరకు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను డిజిటల్ విధానంలో మెరుగుపరచడం ద్వారా సేవల నాణ్యత పెరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సేవలు సమర్థవంతంగా ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. అంగన్వాడీ సేవలు డిజిటల్ విధానంలో మెరుగుపడతాయని, పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు అందించే అన్ని సేవలు డేటా నిర్ధారణ సులభమవుతుందని, ప్రభుత్వ పథకాల అమలు వేగవంతమవుతుందని తెలిపారు. 1065 అంగన్వాడీ కేంద్రాల్లోని 992 మంది అంగన్వాడీ టీచర్లకు, సూపర్వైజర్లకు మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందని తెలిపారు. వీటిని ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపయోగించి ఆన్లైన్ సేవలను పారదర్శకంగా ప్రభుత్వానికి అందించాలని కోరారు. అలాగే మాన్యువల్ గా రిజిస్టర్ లు కూడా నోమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని మొబైల్ ఫోన్ లు అందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల ) బి. రాజ గౌడ్, డిడబ్ల్యూవో రాజ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కౌన్సిలర్ లు, సంబంధిత శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలీ



- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ

పెద్దపల్లి/ ఎలిగేడు ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి): ఈనెల 20 వ తేదీ సోమవారం మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం కేంద్రంగా జరగబోయే / సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని శుక్రవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో జూలపల్లి, ఎలిగేడు మండల కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను సఫలం చేసే దిశగా కాంగ్రెస్ నాయకులు పని చేయాలని దిశా నిర్దేశం చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు, జూలపల్లి మండల పార్టీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

### మండలంలోనిర్మాణం అవుతున్న పలు భవనాల పరిశీలన



జగిత్యాల / బుగ్గారం, ఏప్రిల్ 17( మనం న్యూస్ )ః జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంతో పాటు యశ్వంతరావు పేట గ్రామంలో శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. యశ్వంతరావుపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బుగ్గారంలోని ఎదుల బోర్లలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, మూడు గ్రామ సమైక్య భవనాల నిర్మాణం, మండల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులను, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కాంట్రాక్టర్ లతో, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో, సంబంధిత శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరగా, నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బిల్లుల చెల్లింపులు కూడా త్వరలోనే అవుతాయని, పనులు ఆలస్యం కాకూడదని తెలిపారు. డీఆర్డీఏ పిడి రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ గౌడ్, మండల తహసీల్దార్ భూమేశ్వర్, ఇంచార్జ్ ఎంపిడివో అనుమల్ల వాసవి, ఎపిఎం రమాదేవి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ, ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులు బెజ్జారపు రాజు, పంచాయతీ కార్యదర్శి అక్బర్, విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, విడిసి కోర్ కమిటీ చైర్మన్ పెద్దనవేని రాగన్న, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సా గౌడ్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- అక్రిడిటేషన్లు,ఇండ్లస్థలాలు, ఇండ్లుహెల్త్ కార్డులివ్వాలి
- సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్




పెద్దపల్లి ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి)ః సమిష్టిగా ఉండి... సమస్యలపై పోరాడి ఇండ్ల స్థలాలు, ఇండ్లు, అక్రిడిటేషన్ కార్డులుసాధించుకోవాలనీ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పైడాకుల బిక్షపతి,జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేష్ లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా బిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు జీతభత్యాలు లేకుండా 24 గంటలు నిద్రాహారాలు మాని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ పనిచేస్తున్నారన్నారు. జర్నలిస్టులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని , జర్నలిస్టు ఆరోగ్య భద్రత లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబానికి మీడియా అకాడమీ నుండి కేవలం లక్ష రూపాయలు మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారని ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . మృతిచెందిన జర్నలిస్టు భార్యకు 5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు జారీ చేసిన హెల్త్ కార్డులు పనిచేయకుండా పోయాయని పని ఒత్తిడి వలన అనేక మంది జర్నలిస్టులు అనారోగ్యం పాలవుతున్నారనితెలిపారు.జర్నలిస్టులతో పాటు వారి కుటుంబాల ఆరోగ్య పరిస్థితులు గాలిలో దీపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలికంగా పనిచేస్తుందన్నారు. పాత్రికేయుల అభివృద్ధి, సంక్షేమమే ఏజెండాగా కృషి చేస్తుందన్నారు. సుదీర్ఘంగా పెండింగ్ లో ఉన్న ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛన్లు, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం తదితర సమస్యలపై ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు చేస్తూ వినతిపత్రాలు, దరఖాస్తులు ఇస్తూ ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్ల దృష్టికి తెస్తుందన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఫీజు రాయితీ కల్పించడం లేదనీ, కావున అట్టి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కమిటీలలో ఉన్న బాధ్యులు, సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవహరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అందరూ ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు.సమన్వయంతో పని చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ 2026 నూతన డైరీ నీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుంక మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఫణి సుదర్శన్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బోయిన వినోద్ కుమార్ జిల్లా కమిటీ మెంబర్ ఇరుకుల వీరేశం కార్యవర్గ సభ్యులు గోపికృష్ణ రామదాసు పల్ల మహేష్ షాబిర్ బాషా శ్రీనివాస్ రెడ్డి మేడి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యం

- రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు
- ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరిసిల్లలో అరైవ్.. అలైవ్ కార్యక్రమం
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే
- డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ - 17(మనం ప్రతినిధి)ః వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు పేర్కొన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపిఎస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.

**ఈసందర్భంగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ మాట్లాడుతూ**

ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా స్పందించి ప్రాణాలు కాపాడేది వాహనాల డ్రైవర్లేనని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు.

పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,అలాగే విద్యార్థుల రవాణాలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 'రహవీర్' పథకం కింద ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను సమీప ప్రధాన రహదారుల వెండి ఉన్న ఆసుపత్రులకు తరలిస్తే, వారికి వారం రోజులపాటు ఉచిత చికిత్స అందిస్తూ.. రూ.1,50,000 వరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని వివరించారు.ప్రమాద సమయంలో భయపడకుండా బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి 'రహవీర్' పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు.



## ఆసుపత్రిలో మెరుగైన సేవలు ప్రజలకు అందించాలి

- సీసీ రోడ్డు పనులు, పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని అధికారుల సూచన
- అదనపు ఓపీ బ్లాక్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి)ః శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష(రామగుండం)గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి,ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.ల్యాబ్ యంత్రాలు, ఎసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపా బాయి,రాజు,సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదిక వ్యవసాయ సర్వీసుల మంజూరు



- కేవలం 17 రోజుల్లోనే 541 సర్వీసుల మంజూరు
- వ్యసాయానికి అదనంగా 28 ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు
- జూన్ నాటికి పెండింగ్లో ఉన్నఅన్ని సర్వీసుల మంజూరుకు చర్యలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17(మనం ప్రతినిధి)ః రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని శుక్రవారం రాజన్న సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ టి . వేణు మాధవ్ తెలిపారు. కేవలం 17 రోజుల్లోనే 541 వ్యవసాయ సర్వీసులు మంజూరు చేయడం విశేషమని, ఇది శాఖ పనితీరుకు, రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1400 సర్వీసులు మాత్రమే మంజూరు కావడంతో , ప్రస్తుత వేగంగా గణనీయమైన పురోగతిని సూచిస్తుందని తెలిపారు. వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అవసరమైన ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు ఉన్నాయని , పనులు నిరవధికంగా కొనసాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. జూన్ నెల నాటికి 1950 పెండింగ్లో ఉన్న అన్ని సర్వీసులను పూర్తిగా మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. వినియోగదారుల భద్రత, శ్రేయస్సే ప్రధాన ప్రాధాన్యం అని, వినియోగదారులకు అండగా నిలుస్తూ మరింత మెరుగైన, పారదర్శక సేవలు అందించేందుకు శాఖ కట్టుబడి ఉందని టి . వేణు మాధవ్ స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన కలెక్టర్



- ప్రతి వరి సంచికి 40.600 కిలోల తూకం ఉండాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశం

కామారెడ్డి, ఏప్రిల్ 17 ( మనం ప్రతినిధి)ః కామారెడ్డి జిల్లా రామిరెడ్డి మండలంలోని పోషనిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు విధానాన్ని సమీక్షించిన ఆయన, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రతి వరి సంచికి 40.600 కిలోల తూకం ఉండేలా ఖచ్చితంగా కొలవాలని ఆదేశించారు. అనంతరం సన్న ధాన్యం నాణ్యతను మిషన్ ద్వారా పరీక్షించి, తేమ శాతాన్ని పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రంలో తాగునీరు, నిల్వ సదుపాయాలు వంటి మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రైతులు సులభంగా ధాన్యం విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, ఎంఆర్ఓ సుమలత, పంచాయతీ సెక్రెటరీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పనితీరుపై అడిషనల్ కలెక్టర్ ఆరా

- నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 17 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ శుక్రవారం బల్మూరు మండలంలోని బాణాల గ్రామపంచాయతీ సందర్శించడం జరిగింది. గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులనుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో అదరపు కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో ఉపాధి కూలీ పనులు జరుగుతున్నాయా, లేదా అన్న విషయంపై కూలీలతో స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా వెళ్తున్న కూలీలపై పెండింగ్ కూలీ డబ్బులు విషయంలో తగు చర్య తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను అదరపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులు ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించడం జరిగింది. బాణాల గ్రామ పంచాయతీలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు చెడు అలవాట్ల వైపుకు వెళ్లకుండా ఉండాలని, వారిలో సామాజిక స్ప ృహ కలిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో కలిసి అడిషనల్ కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. తధానంతరం బల్మూరు మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ, ఎంపీడీవో, ఎంపిఓ, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శితో పాటు ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా

**గజ్వేల్, ఏప్రిల్ 17 మనం న్యూస్‌:** గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1725(ఐ .ఎన్. టి. సి. అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి ఆందోళనలో భాగంగా శుక్రవారం నాడు గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి యందు ఒక్కరోజు ధర్న నిర్వహించడం జరిగింది. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండవ వేతన సవరణ సంఘం నివేదిక ప్రవేశపెట్టి తొందరగా అమలు చేయాలని, ఐదు విడుదల కరువు బత్యం మంజూరు చేయుటకు,పాత పెన్షన్ ఓ. పి. ఎస్ విధానముఅమలు చేయుటకే, ఉద్యోగులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే అక్రమ బదిలీలను రద్దు చేయుట, టైం స్కేల్ ఉద్యోగుల సర్వీసులను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న వారిని



వెంటనే రెగ్యులర్ చేయుట,ఉద్యోగులందరికీ ఈ.ఎస్ ఐ వర్తించుటకు ఉద్యోగులకు 126 జీవో సవరించి అమలు చేయుట,దీర్ఘ కాలముగా పనిచేస్తున్న ఉద్యోగస్తుల ప్రమోషన్ కల్పించడం, జీవో 317 బాధితులకు ఉపశమనం కలిగించుటకు కొత్త జీవోను అమలు చేయులని, కొత్త రిక్రూట్మెంట్ ద్వారా సిబ్బంది యొక్క పని భారాన్ని తగ్గించలని గతంలో ఎన్నో పర్యాయాలు ప్రభుత్వ దృష్టికి సమస్యల పరిష్కారం కోసం నివేదించినప్పటికీ అమలు గాని పరిస్థితిలో ఉన్నందున మా యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఒకరోజు ధర్నా నిర్ణయించడం జరిగింది. దశలవాదిగా చేపట్టే ఆందోళనలో భాగంగా తొలి దశలో ఆందోళనగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ మరియు వైద్య విధాన పరిషత్ సమస్యలలో ఈరోజు ధర్నాను విజయవంతం చేసినాము ఉదయం హాజరు సమయంలో రోగులకు అసౌకర్యం కలిగించకుండా నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. తమరి దయతో ఈ విషయాన్ని పరిశీలించి తగువిధంగా నిర్ణయం తీసుకొని ఉద్యోగులకు మేలుజరుగుతుందని ఆశిస్తున్నామని గజ్వేల్ డివిజన్ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస చారి తెలిపినారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీనివాసచారి. చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ విమల, ఎఫ్సిబా నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ ,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ జగదాంబ, వకులాదేవి, నిర్మల, ఉమామహేశ్వరి, ఫార్మసీ ఆఫీసర్స్ మోహన్ బండారి స్వర్ణలత, శిరీష, రమాదేవి, నర్సింగ్ ఆఫీసర్స్ షాహిని ,రశ్మి ,శోభ, రాజు, గౌతమి, హెడ్ నర్సెస్ విమల దేవి, నిర్మల సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్స్ పుష్ప, ఉమా, రోజులిన్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ఈ.సీ.జీ. టెక్నీషియన్ రాజు ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్, సంతోష్ కనకయ్య, హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది మరియు సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ వివాదాన్ని సంఘాలకు ముడిపెట్టొద్దు



**కామారెడ్డి, ఏప్రిల్ 17 ( మనం న్యూస్):** ఇరువురి మధ్య ఉన్న రాజకీయ వివాదాన్ని సంఘాలకు ఆపాదించడం సరికాదని పాల్వంచ మండలం ఫరీద్పేట గ్రామానికి చెందిన దళితులు పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్లో మీడియాతో మాట్లాడుతూ., పాల్వంచ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌ అంబేద్కర్ సంఘాల నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని కేసులు నమోదు చేయడం సరైంది కాదన్నారు. రమేష్ గౌడ్ కులమత భేదాలు లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి అని తెలిపారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాలని పోలీసులకు ఫిర్యాదు చేయడం సబబు కాదని విమర్శించారు. గ్రామ సమస్యలను గ్రామస్థుల సమక్షంలో చర్చించి పరిష్కరించుకోవాలని, కేసులతో సమస్యలు పరిష్కారం కావని అన్నారు. రమేష్ గౌడ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించడం తప్పుబట్టారు. ముట్టడి జరిగితే గ్రామస్థులంతా ఆయన ఇంటివద్దే ఉండి సమస్యను చర్చిస్తామని తెలిపారు. తక్షణమే కేసును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ, ఏఎస్పీ చైతన్య రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన దళితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వరిధాన్యం సేకరణ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



- నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, ఏప్రిల్ 17 ( మనంప్రతినిధి ):** జిల్లాలో వరిధాన్యం సేకరణ, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న, పసుపు విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూం 08462-220183 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతిరోజు ఉదయం 8.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు కంట్రోల్ రూం పనిచేస్తుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటారని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా.. వరి ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ కోసం రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్లు 1967కు లేదా 18004250033కు కూడా రైతులు సంప్రదిం చవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లయ్స్ డీఎం ప్రవీణ్, ఏఎస్‌వో అర్వింద్ రెడ్డి పాల్గొన్నారు.

# అన్నదానం గత కర్మలను తొలగిస్తుంది

- గౌరిశెట్టి శ్రీనివాస్

**గజ్వేల్, ఏప్రిల్ 17 మనం న్యూస్‌:** అన్నదానం చేయడం వలన దైవిక ఆశీర్వాదాలను ఆకర్షిస్తుందిని గౌరిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు అమావాస్య సందర్భంగా స్థానిక ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మా తల్లిదండ్రులైన గౌరిశెట్టి మల్లయ్య విజయలక్ష్మి ల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గజ్వేల్ ఆర్యవైశ్య నాయకులు నంగునూరు సత్యనారాయణ, సిద్ధి బిక్షపతి లు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం గత కర్మలను తొలగించడానికి సహాయపడుతుంది, దీనితో గతించిన వారికి సంతృప్తిని ఇస్తుంది అని అన్నారు. అన్నదానం స్వీకరించిన వారి ఆశీస్సులు అన్నదానం చేసిన వారి జీవితంలో సానుకూలతను తెస్తాయి. అన్నదానం వలన పూర్వీకులను సంతోషపరుస్తుందని, వారికి మోక్షాన్ని పొందడంలో



సహాయపడుతుందని పురాణాలు చెపుతాయని భావిస్తారన్నారు. క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాలు చేస్తే, జీవితంలో అన్ని రంగాలలో అపారమైన ప్రయోజనాలను పొందవచ్చని కొంతమంది నమ్మకం అని, ఇలా అన్నదానం వలన అనేక ప్రయోజనాలను ఉన్నాయి వివరించారు.అన్నదానం అంటే ఆహారాన్ని దానం చేసే పుణ్యకార్యం, ఇది వైదిక సంప్రదాయంలో అత్యున్నత దానంగా పరిగణించబడుతుంది . శాస్త్రాలు 'అన్నదానం మహాదానం' అని కీర్తిస్తాయి, అంటే అన్ని దానాలలో అన్నదానం శ్రేష్ఠమైనది, ఎందుకంటే అది జీవాన్ని నిలబెడుతుంది అని మనస్ఫూర్తిగా నమ్మొచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట బిక్షపతి, కైలాస ప్రభాకర్, గంగిశెట్టి వెంకటేశం, దూపకుంట మెట్రములు, సముద్రాల అమర్నాథ్, గంగిశెట్టి ఉమేష్, సిద్ధి రామ చంద్రం, జగ్గయ్య గారి రాజనారాయణ, శ్రీహరి, దూపకుంట లచ్చయ్యతోపాటు పాల్గొన్నారు.



## శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**సూర్యాపేట ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి):** చివ్వేంల మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నీ శుక్రవారం కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ చేసి స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తో పాటు. చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ అంజద్ అలి, ఉండ్రుగొండ సర్పంచ్ గుడిసె రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, చెంచల మణిలత శ్రీనివాస్, కొనతం రాజేష్ రెడ్డి, సేవదాల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు చెంచల నిఖిల్, పడిదల నిఖిల్, నాగు నాయక్, వాజిద్ మియా తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం దేవుని సేవతో సమానం

- ఐవిఎఫ్ నాయకుడు నవీన్ కుమార్

**గజ్వేల్ ఏప్రిల్ 17 మనం న్యూస్‌:** ఆకలితో ఉన్న వ్యక్తికి అన్నం పెట్టడం దేవునికి సేవ చేయడంతో సమానం అని ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి అధ్యక్షులు, ఐవీఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులువంగపల్లి నవీన్ కుమార్ అన్నారు. ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆదేశాల మేరకు గత 20 మాసములుగా ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేస్తున్నామన్నారు.శుక్రవారం నాడు అమావాస్య సందర్భంగా బాచుపల్లి లోని మమతా మెడికల్ కాలేజ్ ఎదురుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆహారాన్ని అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తారని,ఇది శుభకర్మలను తెస్తుందని, మోక్షాన్ని సాధించడంలో సహాయపడుతుందని, మరియు పూర్వజన్మల పాపాలను నాశనం చేస్తుందని నమ్ముతారన్నరు.క్రమం తప్పకుండా అన్నదాన



కార్యక్రమాలు చేస్తే, జీవితంలో అన్ని రంగాలలో అపారమైన ప్రయోజనాలను పొందవచ్చని నమ్మకం పూర్వం నుండి వస్తుందన్నారు.ఆకలితో ఉన్న జీవికి ఆహారం ఇవ్వడం కంటే మంచి పూజ లేదా మరొక ఆచారం లేదని భావిస్తారు. అన్నదానం అనేది మహాదానం. ఇది సనాతన ధర్మ సంప్రదాయంలో ముఖ్యమైన భాగం. అన్నదానం అనేది మానవునికి అన్నం పెట్టడానికే పరిమితం కాకుండా అన్ని జీవరాశులను ఆవరిస్తుంది. హిందూ గ్రంధాలలో అన్నదానం వైభవాన్ని చాటిచెప్పే అనేక కథలు ఉన్నాయి.వాటిలో పార్వతీ దేవి అన్నపూర్ణేశ్వరి దేవిగా కనిపించి శివునికి ఆహారం ఇవ్వడంలో ప్రముఖమైంది ఈ సందర్భంగా నవీన్ కుమార్ వివరించారు.ఈ కార్యక్రమంలో బాచుపల్లి డివిజన్ సభ్యులు రవీందర్, విద్యాసాగర్, వినయ్, కిరణ్, శ్రీహరి, సుమన్, యాదగిరి, గుణ, ఇతర సభ్యులు మరియు మహిళా విభాగ అధ్యక్షురాలు కవిత , సౌమ్య, పద్మ, రాధిక, కావ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు




**ములుగు, ఏప్రిల్ 17(మనంన్యూస్):** గత నెలలో ఆర్అండ్ఆర్ కాలనీ బైలంపూర్ గ్రామంలో బొల్లు వెంకటేశం తండ్రి యాదగిరి అనునతని ఇంటిలో గుర్తు తెలియని దొంగలు 1,50,000 నగదు దొంగలించినారని, అదేవిధంగా ఆర్అండ్ఆర్ కాలనీ మామిడియాల చెందిన పసుల సత్తయ్య తండ్రిగాలయ్య ఇంట్లో కూడా దొంగతనం జరిగి నగదు 65000 మూడు తులాల వెండి, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లినారు దరఖాస్తులు ఇవ్వగా కేసులు నమోదు పరిచి పరిశోధన ప్రారంభించిన ఎస్సై రఘుపతి , పరిశోధనలో భాగంగా ములుగు ఎస్ఐకి వచ్చిన సమాచారం ఏమనగా ములుగు బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు అని చెప్పి రాగా వెంటనే అక్కడికి వెళ్లి అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని అప్పావత్ శ్రీకాంత్ తండ్రి తార్య వయసు 28 సంవత్సరాలు, కులం ఎస్ టి లంబాడ నివాసం తుర్కపల్లి తండా నివాసం తుర్కపల్లి, మండలం శామీర్పేట జిల్లా మేడ్చల్ మల్కాజ్గిరి అని తెలిపి గత నెల రోజుల కిందట ఆర్అండ్ఆర్ కాలనీ బైలంపూర్ గ్రామంలో రెండు ఇండ్లలో దొంగతనం చేసి డబ్బులు సెల్ ఫోన్ ఎత్తుకెళ్లినాడని తెలుపగా వెంటనే అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుండి దొంగలించిన సొత్తు 50వేల నగదు ఒక సెల్ ఫోను స్వాధీనపరచుకొని కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐపీ ములుగు, సిబ్బందిని సిఐపి గజ్వేల్ రూరల్ సర్కిల్ రవిరాజు అభినందించారు.

## తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి




- బీజేపీ నేత తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఆగ్రహం
- మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ డిమాండ్

**కామారెడ్డి, ఏప్రిల్ 17( మనం న్యూస్ ):** మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ బీజేపీ నేత తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ప్రజలను అవమానించే విధంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను మహిళా రిజర్వేషన్ ద్వారా మున్సిపల్ వైస్ చైర్పర్సన్గా, అనంతరం చైర్పర్సన్గా ఎన్నికైన విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. లైవ్ టీవీలో మాట్లాడుతూ బిల్లుకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం బిల్లుకు ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. 'నారీ శక్తి వందన్ అధినియం'గా పిలవబడే ఈ చట్టం ప్రారంభంలో 15 సంవత్సరాలు అమల్లో ఉంటుందని చెప్పారు. అలాగే భవిష్యత్లో లోక్సభ సీట్ల పెంపు ద్వారా మహిళలకు మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశముందని పేర్కొన్నారు. ఈ కోటాలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా అంతర్గత రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. డిలిమిటేషన్ అంశాన్ని బిల్లుతో కలిపి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ డిలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకమని స్పష్టం చేశారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో 'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రభంజనం

**ఖమ్మం, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని వీడిఓస్ కాలనీ నందు గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో తమ అసాధారణ ప్రతిభను చాటుతూ జాతీయ స్థాయిలో పాఠశాల పేరును మారుమోగించారు. ఈ నెల 6 నుండి 13వ తేదీ వరకు జరిగిన అండర్-14 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పతకాలతో తిరిగి రావడంతో పాఠశాలలో సందడి నెలకొంది. చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో విద్యార్థులు శ్యామ్, జశ్వంత్ సాయి, మరియు జాసిక్ తమ కృషి, పట్టుదలతో ఆడి ద్వితీయ స్థానాన్ని (రన్నరప్) కైవసం చేసుకున్నారు. టచ్ రగ్బీ విభాగంలో శశాంక్, హృతిక్ చంద్ర, మహిదర్, శ్రీకర్ మరియు సాత్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.




అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కేవలం పుస్తక పఠనమే కాకుండా, క్రీడలు కూడా ఒక అంతర్భాగం కావాలి. డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల'క్రీడల్లో గెలుపోటముల కంటే పట్టుదలతో పోరాడటం ముఖ్యం. నేడు జాతీయ స్థాయిలో రాణించిన ఈ విద్యార్థులు రేపు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ సీఐ

### రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సీఐ

**బిచ్కుంద, ఏప్రిల్ 17 ( మనం న్యూస్):** బిచ్కుంద మండలంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. ఒక బాధితుడి నుంచి రూ. 2 లక్షల లంచం తీసుకుంటుండగా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం., ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి కల్లు దుకాణాన్ని మార్చుకునేందుకు అనుమతి ఇవ్వడానికి, అలాగే ఎటువంటి కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు సీఐ సత్యనారాయణ బాధితుడి వద్ద నుంచి లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా పెట్టారు. శుక్రవారం సీఐ తన నివాసంలో బాధితుడి నుంచి రూ. 2 లక్షల నగదు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం దాడి చేసి ఆయన్ని అదుపులోకి తీసుకుంది. సీఐ చేతులను కెమికల్ పరీక్షకు గురి చేయగా పాజిటివ్ అని తేలింది. అనంతరం ఆయన ఇంట్లో జరిపిన సోదాల్లో లెక్కలోకి రాని అదనంగా మరో రూ. 45,670 నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐ సత్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయన్ని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం హైదరాబాద్లోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ



కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా అధికారులు ప్రజలను కోరారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి ,ఏప్రిల్ 17, మనం న్యూస్ ప్రతినిధి :** జిల్లాలో రబి-యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, పీపీసీ, ఐకేపీ సెంటర్ల ఇన్చార్జిలు, తూనికలు కొలతల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు,ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు,ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన




సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ .... జిల్లాలో 2025-26 రబీ సీజన్లో మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో దొడ్డురకం ధాన్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండనున్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్కు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369 నిర్ణయించినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్కు రూ.2,389, అదనంగా రూ.500 బోనస్ తో రూ . 2,889 లు , అందించనున్నట్లు తెలిపారు . రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 226 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వీటిలో ఐకేపీ ఆధ్వర్యంలో 97, ప్యాక్స్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్పీవో ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు వంటి మౌలిక సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సెంటర్ నిర్వాహకులు ప్రతిపాదించిన రైస్ మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని లారీల ద్వారా తరలించాలని, సొంత రవాణా వాహనాలు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. గతంలో తలెత్తిన లోటుపాట్లను సరిచేసుకుని ఈసారి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అన్నారు. ఆన్లైన్ ట్యాబ్ నమోదు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సీరియల్ నంబర్లు కేటాయించాలని పేర్కొన్నారు . అకాల వర్షాల సమయంలో ధాన్యాన్ని రక్షించే బాధ్యత సెంటర్ ఇన్చార్జిలదేనని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లతో సమన్వయం చేసుకుని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు, తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా సహకార శాఖ కిరణ్ కుమార్, ఏ సి ఎస్ ఓ రాజేశ్వర్ , డిపిఎం లు, ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీ లు ,వ్యవసాయ అధికారులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధికి 9 కోట్లు మంజూరు

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు

## మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాదం

**మధిర టౌన్, ఏప్రిల్ 17(మనం న్యూస్):** మధిర పట్టణ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం రూ 9 కోట్లు మంజూరు చేశారు. వైరా నది కరకట్ట పక్కన ఈ ప్రాజెక్టు అమలు ద్వారా మధిర పట్టణానికి కొత్త అందం రావడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని చైర్పర్సన్ అన్నారు. ఈ సందర్భంగా మధిర అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క కి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాదం కృతజ్ఞతలు తెలియజేసినారు.

# గోనె సంచుల గుట్టు బట్టబయలు



## మార్క్ ఫెడ్లో మాఫియా రాజ్యం!

## 30 వేల గోనె సంచుల గోల్‌మాల్ ఆరోపణలు

## అధికారులపై అనుమానాలు.. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు

**కొణిజర్ల, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో గోనె సంచుల అక్రమాలు భారీగా జరుగుతున్నాయన్న ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల నుంచి గోనె సంచులను ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలానికి అక్రమంగా తరలించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో మార్క్ ఫెడ్ డీఎంల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కొంతమంది అధికారులు దుర్వినియోగం చేస్తూ అవినీతి కేంద్రంగా మార్చుకున్నారని ఆరోపించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల మార్క్ ఫెడ్ డీఎం నరసింహారావు



ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా మార్క్ ఫెడ్ డీఎం శ్యామ్ ఇద్దరు అధికారులు కుమ్మక్కై గోనె సంచుల అక్రమ రవాణా జరుగుతోందని తెలిపారు. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన డేరంగుల బ్రహ్మం అనే వ్యక్తి, సంబంధిత అధికారికి మామ కావడం వల్ల ఈ వ్యవహారం సజావుగా సాగుతోందని ఆరోపించారు. సీజన్ తక్కువగా ఉన్న మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల నుంచి సుమారు 30,000 గోనె సంచులను రహస్యంగా తరలించి, కొణిజర్ల పరిధిలోని రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా, అదే వ్యక్తి దళారిగా మారి స్థానిక రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను తక్కువ ధరలకు కొనుగోలు చేయిస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్న పండించని రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలు సేకరించి, వాటి పేర్లపై లోడ్లు ఎత్తుతున్నారని కూడా చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం జిల్లా మార్క్ ఫెడ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని, సంబంధిత అధికారులు లారీ టెండర్ దారులను బెదిరించి టిక్కీకి రూ.15 వసూలు చేస్తూ లక్షల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా, కొన్ని రోజుల క్రితం జిల్లా కలెక్టర్ను కలిసి ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ, ఖమ్మం జిల్లా మార్క్ ఫెడ్ డీఎం కలెక్టర్కు తప్పుడు నివేదిక సమర్పించారని సూరంపల్లి రామారావు ఆరోపించారు. దీంతో అసలు అక్రమాలు వెలుగులోకి రాకుండా మాయమాటలు చెప్పి వ్యవహారాన్ని మగ్గిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని గోనె సంచులు అమ్మడం, అక్రమ వసూళ్లు చేయడం ప్రభుత్వాధికారులకు తగదు అని ఇది పూర్తిగా మాఫియా తరహా వ్యవహారం అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులతో పాటు సంబంధిత శాఖలు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల కష్టాన్ని దోచుకుంటున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.



## విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించటానికే మోడల్ ఎంసెట్, నీట్

- ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

**ఖమ్మం, ఏప్రిల్ 17(మనం న్యూస్):** పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకొని విజయాలు సాధించాలని మోడల్ టెస్టుల ద్వారానే విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోడల్ నీట్ మరియు మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహించారు జిల్లా కేంద్రంలో స్థానిక డాక్టర్స్ అకాడమీ లో మోడల్ నీట్ ఇంజనీరింగ్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ప్రశ్నపత్రాల ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థు లకు పరీక్షల పట్ల ఒక అవగాహన వస్తుందని, అదే విధంగా మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీ క్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఉండ డానికి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో 26 సంవత్స రాలుగా మోడల్ ఎంసెట్, నిర్వహిస్తున్నారని తెలిపా రు. నీట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది ఉపయోగమన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ. మాట్లాడుతూ విద్యార్థుల విజయమే లక్ష్యంగా ప్రణాళి క బద్ధంగా ఒత్తిడిని తట్టుకొని విజయాలు సాధించా లన్నారు సమాజంలో పోటీ పెరుగుతుందని పోటీకి తగ్గట్టుగా ఇష్టపడి కష్ట పడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని ఓడిపోయామని కుంగిపోవద్దని ఓటమి రేపటికి విజయానికి నంది పలుకుతుందని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ సదానందం ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సమితి సభ్యులు తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, జిల్లా నాయకులు గోపి, పవన్, గోపి, వెంకటేష్ , చైతన్య, నరేందర్, బన్ను నాగేశ్వరరావు, ఉమా మహేష్, సందీప్ పాల్గొన్నారు.

# సైబర్, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి
- రహదారి ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం
- రహదారుల ప్రమాదాల నివారణకు అవగాహన కీలకం
- కలెక్టర్ అంకిత్



**దమ్మపేట, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో అరైవ్ అ లైవ్ కార్యక్రమం కింద శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్హత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు నిత్యం సైబర్ మోసాలు, రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చుగానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. 'అరైవ్ అ లైవ్' కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి రహదారి భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. పూసుకుంట గిరిజన కొండరెడ్డి సమాజానికి చెందిన వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్, పాల్వంచ డిఎస్పి సతీష్, తాసిల్దార్ రామ్ నరేష్ ఎంపీడీవో రవీందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సుంద్రా గ్లోబల్లో ఉద్యోగావకాశాలు

## ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ నియామకాలు



**ఖమ్మం, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం కు చెందిన సుంద్రా గ్లోబల్ సంస్థ జిఐఎస్ భౌగోళిక సమాచార వ్యవస్థ ఇంజనీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ నియామకాలలో ఎంపికైన విద్యార్థులకు నెలకు 15,000 జీతం అందించనున్నట్లు కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపస్ నియామక కార్యక్రమం ద్వారా తమ విద్యార్థినులు మంచి సంస్థలో ఉద్యోగ అవకాశాలు పొందడం ద్వారా మిగతా విద్యార్థినులకు స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళా విద్యార్థులను సాంకేతికంగా, నైపుణ్యంగా అభివృద్ధి చేసి, వారికి స్వయం ఉపాధి, గౌరవప్రదమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ ట్రైనింగ్, ఇంటర్న్షిప్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని, విద్యార్థినులు తమ బాధ్యతలను అర్థం చేసుకుని, క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తూ తమ వృత్తి జీవితంలో ముందుకు సాగాలని, ఈ అవకాశాన్ని మరింత అభివృద్ధి దిశగా మలచుకోవాలని తెలిపారు. మొత్తం 45 మంది హాజరైతే 20మంది ఎంపికయ్యారని తెలిపారు. ఈ నియామక కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులుగా ప్రాజెక్ట్ డెలివరీ మేనేజర్ బి. విజయ్ పాల్, ఆపరేషన్స్ మేనేజర్ జి. శ్యామ్, హెచ్.ఆర్ మేనేజర్, హెచ్.కే. జెస్సీ హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ బి.విజయ్ పాల్ మాట్లాడుతూ జిఐఎస్ ఇంజనీర్ అనేది జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జిఐఎస్) సాఫ్ట్వేర్, డేటాబేస్లు, అప్లికేషన్లను డిజైన్ చేయడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తారని తెలిపారు. స్పేషియల్ డేటాను విశ్లేషణ, విజువలైజేషన్ కోసం ఉపయోగించడం, జిఐఎస్ వర్క్ఫ్లోను రూపొందించడం, ఆటోమేషన్ చేయడం, ఇతర సిస్టమ్స్తో సమన్వయం చేయడం ఈ ఉద్యోగంలో ముఖ్యమైన భాగమని చెప్పారు. అలాగే ఏఆర్సి జిఐఎస్, క్యూజిఐఎస్, ఎస్క్యూల్ వంటి టూల్స్పై నైపుణ్యం అవసరమని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని, క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం, నిరంతర అభ్యాసం విజయానికి మూలాధారాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# 19న జెవివి ఆధ్వర్యంలో విద్యా సదస్సు

**ఖమ్మం, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ఈ నెల 19న ఆదివారం ఖమ్మంలోని డిపిఆర్సి భవన్(ఏసి)లో విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.మోహన్, కె.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంటలకు ముగుస్తుందన్నారు. ఎన్ఈపి-2020- ఉన్నత విద్య-తీరుతెన్నులు అంశంపై ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ అందె సత్యం, ఎన్సిఎఫ్ -2023-పాఠ్యాంశాల్లో మార్పులు అంశంపై విశ్రాంత ఆచార్యులు కోయ కోటేశ్వరరావు, తెలంగాణ పాఠశాల విద్య-సవాళ్లు అనే అంశంపై సొసైటీ ఫర్ ఛేంజ్ ఇన్ ఎడ్యుకేషన్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎడమ శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ విద్యా సదస్సుకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాజా రాజా హాజరవుతారని తెలిపారు. విద్యాభిమానులు, విద్యావేత్తలు ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత..


- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రాహ-వీర్ పథకం క్రింద గోల్డెన్ అవర్లో సహాయం చేసిన వారికి 25 వేలు బహుమతి
- జిల్లాలో 30 బ్లాక్ స్పాట్లను సరిదిద్దడంతో ప్రమాదాలు తగ్గుదల
- రాంగ్ సైడ్ డ్రైవింగ్పై ఏఐ ద్వారా కఠిన చర్యలు
- హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి... నిర్లక్ష్యం ప్రాణాంతకం
- ఆర్టీవో కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

**ఖమ్మం, ఏప్రిల్ 17(మనం బ్యూరో):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రాహ-వీర్, పిఎం రాహత్ అనే రెండు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి తరలించిన వారికి రాహ-వీర్ పథకం క్రింద 25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పీఎం రాహత్ పథకం క్రింద ప్రమాద బాధితులకు లక్షన్నర వరకు నగదు రహిత చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ పథకాలు గోల్డెన్ అవర్ను సమర్థవంతంగా వినియోగించేందుకు తీసుకొచ్చినవని తెలిపారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం మన రక్షణ కోసమేనని, వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించడం సరికాదని సూచించారు. కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ మాత్రమే



కాకుండా ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో టాప్ 30 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దినట్లు తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గి ఈ ఏడాది 15 మంది ప్రాణనష్టం తగ్గిందని అన్నారు. మరిన్ని బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (అఐ) టెక్నాలజీని వినియోగించి వాహనాలను గుర్తించి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సులు రద్దు చేసి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా రోడ్డు భద్రతలో అగ్రగామిగా నిలవాలని, ప్రమాదాలు జరగకుండా అందరూ కృషి చేయాలని సూచించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలను చూస్తున్నప్పటికీ ఇంకా నిర్లక్ష్యం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి తమను తాము రక్షించుకోవాలని, ఒకరి ప్రాణ నష్టం కుటుంబానికి, తమకు ఎంతో పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడం అని భావించాలన్నారు. వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించడం తప్పనిసరి అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.

అలాగే కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, డాక్టర్లచే డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండటం రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకమని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మేయర్ లు కేఎంసి డిఆర్ఎఫ్ టీమ్ సిబ్బందికి హెల్మెట్లు ప్రధానం, రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు, ఆర్టీసీ ఖమ్మం రీజియన్ లో ఉత్తమ డ్రైవర్ లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఆర్టీఓ జె.ఎన్. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఏఎంవిఐలు జి. దినేష్, జి. సుమలత, ఆర్టీఏ మెంబర్ జి. వెంకన్న, కౌన్సిలర్లు, వాహనదారులు, ప్రజలు, సాంస్కృతిక సారథి కళాకారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# మే 1న శ్రీ కపిలేశ్వరాలయంలో పత్ర పుష్పయాగం

**తిరుపతి, ఏప్రిల్ 17,మనం న్యూస్ :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వర స్వామివారి ఆలయంలో మే 1వ తేదీన పత్ర పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు ముందురోజు ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం జరుగనుంది. మే 1న ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారు, శ్రీ కామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మహా పూర్ణాహుతి, కలశాభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, పంచామృతం, చెరకు రసం, కొబ్బరి నీరు, విభూతి, పసుపు, చందనం వంటి పవిత్ర ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తారు.

ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరుగనుంది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, కనకాంబరం వంటి పుష్పాలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీ చంద్రశేఖర స్వామి, మన్మోహిని అమ్మవార్ల తిరువీధి ఉత్సవం భక్తులను అలరించనుంది. లోకక్షేమం కోసమే కాకుండా ఆలయంలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తుల వల్ల జరిగిన లోపాల నివారణార్థం పత్ర పుష్పయాగాన్ని నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

# స్వీయ జనగణనపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- ఈనెల 30వరకు నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఏప్రిల్ 17,మనం న్యూస్ :** స్వీయ జనగణనలో ప్రజల భాగస్వామ్యంతో ఖచ్చితమైన డేటా రూపొందించడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలకు బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. నేటి శుక్రవారం ఉదయం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో చిత్తూరు జిల్లాలో స్వీయ జనగణన పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిత్తూరు జిల్లాలో స్వీయ జనగణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాను మండలాలు, పంచాయతీలు, హాబిటేషన్ల వారీగా విభజించి, ప్రతి హాబిటేషన్ను హౌస్ లిస్టింగ్ బ్లాక్ గుర్తించామని చెప్పారు. ఒక్కో హ ఎల్ బిలో సుమారు 150 నుంచి 200 గృహాలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3,036 హ ఎల్ బి లు ఉండగా, 2,885 మంది ఎన్యుమరేటర్లు (రిజర్వ్ సహా), 493 మంది సూపర్వైజర్లు నియమించబడినట్లు తెలిపారు. మొత్తం 31 చార్జు (27 మండలాలు, 3 మునిసిపాలిటీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్) కింద ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. అదనంగా 30 చార్జ్ అధికారులతో పాటు ఒక ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి మున్సిపల్ కార్పొరేషన్కు బాధ్యత వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏఔఆకు ఒక ఎన్యుమరేటర్తో పాటు రిజర్వ్ ఎన్యుమరేటర్ను నియమించి, వారికి మండల మరియు జిల్లా స్థాయిలో శిక్షణ అందించామని చెప్పారు. ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లకు మూడు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 25 వరకు విడతల వారీగా శిక్షణలు పూర్తిచేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఐదు ఎన్యుమరేటర్ల పనిని పర్యవేక్షించేందుకు ఒక సీనియర్ సూపర్వైజర్ను నియమించి, రోజువారీ పర్యవేక్షణతో పాటు సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు సహకరిస్తున్నారని చెప్పారు.

ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్వీయ జనగణన



నిర్వహించబడుతుందని, అనంతరం మే 1 నుంచి మే 30 వరకు హ ఎల్ బి సెన్సస్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.స్వీయ జనగణన కోసం ప్రజలు ప్రభుత్వం రూపొందించిన వెబ్సైట్లోకి వెళ్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎంపిక చేసి, తమ నివాస స్థలాన్ని నమోదు చేయాలని సూచించారు. మొబైల్ నంబర్ నమోదు చేసిన తర్వాత ఓ టీ పీ ద్వారా ధృవీకరణ జరిగి, తరువాత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి సుమారు 10 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా గృహ స్థితి, గదుల సంఖ్య, కుటుంబ సభ్యుల సంఖ్య, కులం, గృహ యాజమాన్యం, త్రాగునీటి వనరు, విద్యుత్ వనరు, వంట ఇంధనం, మరుగుదొడ్డి సదుపాయం, స్నాన సదుపాయం వంటి ప్రాథమిక వివరాలతో పాటు టీవీ, ఇంటర్నెట్, వాహనాలు వంటి సౌకర్యాలపై వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వీయ జనగణన ప్రక్రియలో చురుకుగా పాల్గొని, ఖచ్చితమైన సమాచారం అందించాలని కోరారు.

స్వీయ జనగణన ఆన్లైన్ పోర్టల్

ట్ఛ.ఛ్చిుటఋజౌరి.జీ్ఞ ద్వారా తన సొంత వివరాలను నమోదు చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు.

ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వచ్చి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టి స్వీయ గణనను ధృవీకరిస్తారన్నారు. పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ జనగణన కార్యక్రమం సమాచార సేకరణ మాత్రమే కాకుండా రానున్న రోజుల్లో అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగనుందని మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల జాబితా... ఇండ్ల గణన, కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కే మోహన్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణ

- పట్టుబడిన వారి పై పి డి యాక్ట్ నమోదు
- జిల్లాలో పట్టుబడిన 4,100 కేజీల గంజాయి
- కోర్టు అనుమతితో డిస్పోజ్

**తిరుపతి, ఏప్రిల్ 17, మనం న్యూస్ :** జిల్లాలో పట్టుబడిన సుమారు 4,100 కేజీల గంజాయిని కోర్టు అనుమతి తో డిస్ పోజ్ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం రేణిగుంట మండలం తుక్కివాకం వద్ద ఉన్న సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ సెంటర్లో జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మరియు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ల సమక్షంలో చట్టపరమైన విధానాల ద్వారా డిస్ పోజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గంజాయి పండించడం, రవాణా, వినియోగం పై చాలా కఠినంగా వ్యవహరించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈగల్ సంస్థను ఏర్పాటు చేసి ఐజీ ర్యాంక్ అధికారిని నియమించి ప్రతి జిల్లాలో అనుబంధంగా అధికారులను ఏర్పాటు చేసి గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద కఠినంగా వ్యవహరించడం జరుగుతున్నదన్నారు. తిరుపతి జిల్లాలో గడిచిన రెండు నుంచి మూడు



సంవత్సరాల్లో సీజ్ అయినటువంటి గంజాయిని తూకివాకంలో ఇన్సినరేషన్ పద్ధతి ద్వారా డిస్పోజ్ చేస్తున్నామని, సుమారు 208 కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.20 కోట్ల విలువ గల 4,100 కేజీల గంజాయిని కోర్టు నుంచి అనుమతి తీసుకుని డిస్పోజ్ చేస్తున్నామన్నారు. దీని ద్వారా గంజాయి రవాణా, వినియోగించే వారికి గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందన్నారు. తిరుపతి పట్టణం బెంగళూరు, చెన్నైకి ఒక ట్రాన్సిట్ పాయింట్గా గంజాయి రవాణాలో గుర్తించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాకు ఎక్కువగా ఏఎస్ఆర్ జిల్లా నుంచి వైజాగ్, కాకినాడ మీదుగా బస్సుల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిరుపతికి వచ్చి, ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు మరియు కేరళకు వెళ్లడం గమనించామన్నారు. వాటిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సెర్చ్ పార్టీలను పెట్టి ట్రైన్స్, బస్సులు, లగేజీలను పరిశీలించి చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేయడంతో పాటు లక్ష మంది స్కూల్ మరియు కాలేజ్ 8, 9, 10 మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చి, ఆన్లైన్ ద్వారా గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాల మీద అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఒక వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు పిడి యాక్ట్ కింద కేసులు పెడుతూ గంజాయి వాడకాన్ని నియంత్రిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో సుమారు 15 పీడీ కేసులు (ప్రివెంటివ్ డిటెన్షన్) పెట్టడం జరిగిందన్నారు.

గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, భవిష్యత్తులో ఎవరైనా గంజాయి రవాణా చేసినా, నిల్వ చేసినా, సహకరించినా లేదా వినియోగించినా వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ అందరికీ జిల్లాలో గత మూడు సంవత్సరాల నుండి సీజ్ చేసిన సుమారు 4 వేల కేజీల గంజాయి కోర్టు అనుమతితో డిస్పోజ్ చేస్తున్నామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం అరికట్టడంలో పోలీస్ శాఖ ఎటువంటి అలసత్వం వహించదు. ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా గంజాయి, మత్తు పదార్థాల వాడకం దుష్ప్రభావం, ఆరోగ్య సమస్యల ను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారి పై పి డి యాక్ట్ కింద అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. వివిధ విద్యా సంస్థలు, ఎన్జీవోలు, పోలీస్ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. తిరుపతి ఒక ఆధ్యాత్మిక నగరం, ఎటువంటి గంజాయికి స్థానం లేదని ఆ దిశగా ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పని చేయడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లో మరింత పూర్తిగా అవగాహన కల్పించి, లీగల్ ప్రొసీజర్ ప్రకారం వెళ్తూ గజాయిని పూర్తిగా రూపుమాపడానికి చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో గంజాయి, మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలు, మీడియా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి లు, డిఎస్పి లు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి



- టిటిడి జేఈవో డా. ఎ. శరత్

**తిరుపతి(టిటిడి), ఏప్రిల్ 17,మనం న్యూస్ :** తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతీ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని నిర్ణయించిన గడువులో పూర్తి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, ప్రతి ఫ్లోర్లో ఒక గదిని మోడల్ యూనిట్గా అభివృద్ధి చేసి, ఆ గదిలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, మెడికల్ ఎక్విప్మెంట్ తదితర సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గదుల్లో ఆమోదిత లేఅవుట్కు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్ పనులను సంబంధిత విభాగాలు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి గదిలో రోగి సేవలకు అవసరమైన మెడికల్ మరియు సపోర్ట్ సదుపాయాలు నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రముఖ ఆసుపత్రులలో అమలులో ఉన్న ఉత్తమ పద్ధతులపై నివేదికలు సేకరించి అమలు చేయాలని సూచించారు. అనంతరం నూతన భవనంలోని 6 అంతస్తుల గదులు, పై అంతస్తులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి సమీపంలో అధికారులతో సమావేశమై నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఈ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు మనోహర్ , వేంకటేశ్వర్లు, డిఈ శ్రీమతి సరస్వతి, డిప్యూటీ ఈఈ శ్రీ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ను ప్రారంభం

**తిరుపతిటౌన్, ఏప్రిల్ 17,మనం న్యూస్ :** స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.

గురువారం కచ్చపి ఆడిటోరియం నందు తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమీషనర్ ఎన్.మౌర్య ప్రారంభించి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలించారు.

స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో నగరంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నగరంలోని ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేలా ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఉల్లంఘన, ఎమర్జెన్సీ, మున్సిపల్ సేవలు, వాహనాల దొంగతనాలు, నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు గుర్తించడం వంటి వాటికోసం ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎంత ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణ చక్కగా చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. స్మార్ట్ సిటీలైన వైజాగ్, కాకినాడ తరహాలో తిరుపతి నగరంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి ట్రాఫిక్, శానిటేషన్, ఎమర్జెన్సీ వంటి సేవలకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఒక చోట నుండే నగరంలోని అన్ని ప్రాంతాల్లో జరిగేటువంటి వాటిని ఆపరేట్ చేయడానికి వీలుంటుందని తెలిపారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాల వలన ట్రాఫిక్ మేనేజ్మెంట్, క్రైమ్ మేనేజ్మెంట్ చేయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారికి పోలీస్ లేకున్నా ఆన్లైన్ ద్వారా జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి, తిరుమల లో జరిగే ఉత్సవాల్లో భక్తులను కంట్రోల్ చేయవచ్చునని తెలిపారు. తిరుపతి కి వచ్చినప్పటి నుండి వెళ్లేవరకూ ప్రతి వ్యక్తి కదలికలు గుర్తించేందుకు, ప్రకృతి వైపరీత్యాల వలన వచ్చే ఇబ్బందులు ఎదుర్కొనేందుకు ఈ సెంటర్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. మునిసిపల్, పోలీస్, రెవిన్యూ విభాగాలు కలసి మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జి.ఎం.చంద్రమౌళి, ఈ.ఈ.రవి, ఎన్.ఈ.సి., కెల్ట్రాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**చిత్తూరు, ఏప్రిల్ 17, మనం న్యూస్ :** విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు వంటి పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు.

ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

2026 జనవరి నుండి ఇప్పటి వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో మొత్తం 612 కేసులు నమోదు చేసి, రూ.69,500/- జరిమానా విధించామని తెలిపారు.

2025 వ సంవత్సరంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో మొత్తం 1901 కేసులు నమోదు చేసి, రూ. 2,77,700/- జరిమానా విధించామని తెలిపారు.



జిల్లాలో విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో సిగరెట్లు, నిషేధిత ఖైనీ, గుట్కా మరియు మత్తు కలిగించే ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసులు, ఈగల్ మరియు ఎస్పీ పోలీసులు సంయుక్తంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టి, కోట్పా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వలన ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, వాటి వినియోగాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2003లో కోట్పా చట్టాన్ని అమలు లోకి తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో ఈ ఉత్పత్తులు లభ్యమైతే విద్యార్థులు అలవాటు పడే ప్రమాదం ఉందని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పొగాకు ఉత్పత్తుల విక్రయాన్ని నిలిపివేయాలని జిల్లా ఎస్పీ కోరారు. భవిష్యత్తులో ఈ తరహా తనిఖీలను మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు.

# గుంటూరులో మద్యం షాపును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

**గుంటూరు ఏప్రిల్ 17 (మనం న్యూస్ ప్రతినిధి) :** మద్యం వ్యాపారంలో ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటివ్వబోం.గత ఐదేళ్లు ఎక్సైజ్ శాఖను అడ్డం పెట్టుకుని జేబులు నింపుకున్నారు.జగన్ రెడ్డి తన సొంత మద్యం బ్రాండ్లతో వేలాది మంది ప్రాణాలు తీశారు.ఎక్సైజ్ సురక్ష, ట్రాక్ అండ్ ట్రేస్ వంటి విధానాలతో ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్న మంత్రి కొల్లు రవీంద్ర.ఏపీ ఎక్సైజ్ వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి తొలుత మద్యం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.శాంపిల్స్ పరిశీలించారు.అనంతరం మద్యం షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు.షాపు స్టాక్ రికార్డుల్ని తనిఖీ చేశారు.ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా బాటిళ్లను స్కాన్ చేసి వివరాలను పరిశీలించారు. షాపుకు వచ్చిన మద్యం కొనుగోలు దారులతో మాట్లాడి నాణ్యత గురించి అడిగి



తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం.ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని అందించాం.గత ఐదేళ్లు ప్రభుత్వ మద్యం షాపుల పేరుతో కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారు. సొంత బ్రాండ్లను అమ్మకంతో జేబులు నింపుకున్నారు. క్వాలిటీకి తిలోదకాలిచ్చి కల్తీ మద్యాన్ని అమ్మారు.ఫలితంగా గత ఐదేళ్లలో సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది కిడ్నీ, లివర్ సమస్యలతో ఇప్పటికీ ఆస్పత్రుల్లో ప్రాణాలతో పోరాడుతున్నారు.అందుకే మద్యం అమ్మకాల్లో వినూత్న మార్పులు తీసుకొచ్చే లక్ష్యంతో విశాఖపట్నం, కాకినాడ, చిత్తూరు, కర్నూలు, గుంటూరులో టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశాం.

# ఎన్ఆర్ఐ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఊరట

**నాలుగున్నర సంవత్సరాలకే ఫీజులు**
**స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బాడీకి ప్రతిపాదనలు**



**తిరుపతి, ఏప్రిల్ 17,మనం న్యూస్ :** స్విమ్స్ - శ్రీ పద్మావతీ మహిళా మెడికల్ కాలేజీలో 2021-22 బ్యాచ్ ఎంబీబీఎస్ కోర్సుకు ట్యూషన్ ఫీజులను ఐదు సంవత్సరాలకు కాకుండా 4ట సంవత్సరాలకే వసూలు చేయాలని నిర్ణయించారు.

2021-22 బ్యాచ్కు చెందిన ఎన్ఆర్ఐ ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇటీవల టిటిడి ఈవోను కలిసి తమ కోర్సు వ్యవధి 4ట సంవత్సరాలు మాత్రమే కావడంతో అదే మేరకు ఫీజులు వసూలు చేయాలని టిటిడి ఈవో శ్రీ ఎం.రవిచంద్రకు విజ్ఞప్తి చేశారు. స్విమ్స్ - శ్రీ పద్మావతీ మహిళా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సుకు ట్యూషన్ ఫీజులను 5 సంవత్సరాలకు వసూలు చేస్తున్నట్లు వారు వినతి పత్రం సమర్పించారు.

ఈ అంశాన్ని పరిశీలించిన టిటిడి ఈవో, నేషనల్ మెడికల్ కమిషన్ 07-04-2026న జారీ చేసిన నిబంధనలను పరిశీలించి, ఎన్ఆర్ఐ ఎంబీబీఎస్ కోర్సుకు ఫీజులు 4ట సంవత్సరాలకే వసూలు చేయాలని నిర్ణయించారు.

ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో చర్చించి, తగిన ఆమోదం (రాటిఫికేషన్) పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ప్రస్తుతం 2021-22బ్యాచ్ విద్యార్థులు చివరి సంవత్సరంలో ఉండటంతో, వారికి 5 సంవత్సరాలకంటే 4ట సంవత్సరాలకే ఫీజులు వర్తింపజేయాలని నిర్ణయించారు. ఇదే విధానం ఇకపై వచ్చే తదుపరి బ్యాచ్లకు కూడా అమలు కానుంది.

# రూ.215 కోట్ల ఈడీ కేసులో ట్విస్ట్..

- **అప్రూవర్‌గా మారతానన్న నటి జాక్వెలిన్**

**ఢిల్లీ , ఏప్రిల్ 17:** ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌కు సంబంధించిన రూ.215 కోట్ల మనీలాండరింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అప్రూవర్గా మారేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు అనుమతివ్వాలంటూ ఢిల్లీ కోర్టును అభ్యర్థించారు. అయితే, ఇందుకోసం ముందుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను సంప్రదించాలని నటికి న్యాయస్థానం సూచించింది.

నిబంధనల ప్రకారం.. ఇలాంటి కేసుల్లో అప్రూవర్‌గా మారాలంటే ముందుగా దర్యాప్తు సంస్థను అభ్యర్థించాల్సి ఉంటుంది. ఆమె వాంగ్మూలాన్ని రికార్డ్ చేసిన అనంతరం.. సాక్షిగా మారేందుకు కోర్టులో దరఖాస్తు చేయాలా, వద్దా అనేదాన్ని దర్యాప్తు సంస్థ నిర్ణయిస్తుంది. ఈ మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి తనపై ఈడీ కేసు కొట్టేయాలంటూ జాక్వెలిన్ వేసిన పిటిషన్‌ను గతేడాది సుప్రీంకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆమె అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ.215 కోట్ల దోపిడీ కేసులో జాక్వెలిన్‌ను ఈడీ నిందితురాలిగా పరిగణించిన సంగతి తెలిసిందే. దోపిడీ చేసిన డబ్బు నుంచి నటి లబ్ధి పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు గతంలో వెల్లడించాయి. సుకేశ్ దోపిడీదారు అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి.

ఇక, సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అత్యంత ఖరీదైన డిజైనర్ బ్యాగులు, జిమ్ సూట్లు, వజ్రాల చెవిపోగులు, బ్రాస్లెట్, మినీ కూపర్.. ఇలా దాదాపు రూ.10 కోట్ల విలువైన కానుకలను జాక్వెలిన్, ఆమె కుటుంబసభ్యులకు సుకేశ్ ఇచ్చినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది.

కాగా.. ఈ ఆరోపణలను పలుమార్లు ఖండించిన నటి.. తనపై నమోదైన ఈడీ కేసును కొట్టేయాలంటూ తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనికి ఉన్నత న్యాయస్థానం తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇదిలాఉండగా.. జాక్వెలిన్ తన ప్రేయసి అని సుకేశ్ పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆమె పుట్టిన రోజు, ప్రత్యేక సందర్భాల్లో జైలు నుంచే అతడు నటికి ప్రేమ సందేశాలు పంపించడం గమనార్హం.

# ప్రపంచంలోనే తొలి ఎయిర్ టాక్సీ స్టేషన్ సిద్ధం

- **దుబాయ్ యువరాజు ప్రకటన**

**దుబాయి, ఏప్రిల్ 17 :** ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఎయిర్టాక్సీలు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక దేశాలు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. త్వరలో తమ పౌరులకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు దుబాయ్ ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రపంచంలోనే తొలి ఎయిర్‌ట్యాక్సీ స్టేషన్‌ను నిర్మించింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో నిర్మించిన స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. స్టేషన్‌లోనిప్రత్యేకతలివే..


3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్ టాక్సీ స్టేషన్ నిర్మాణం.. ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాల కల్పన.. కార్లలో సుమారు 45 నిమిషాలు పట్టే సమయంతో పోలిస్తే ఎయిర్ ట్యాక్సీల్లో కేవలం 10 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరే అవకాశం.. రెండు ల్యాండింగ్ ప్యాడ్లు, ఎలక్ట్రిక్ విమానాల కోసం ఛార్జింగ్ పాయింట్లు, రెండు-స్థాయుల కార్ పార్కింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులోఅర్బన్ ఎయిర్ ట్యాక్సీ సేవలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, మెడికల్,



ఎమర్జెన్సీ సేవల కల్పనకు అవకాశం

నాలుగు స్టేషన్ల నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ఎయిర్ స్టేషన్‌ను నిర్మించినట్లు అధికారులు వెల్లడించారు. 2026 చివరికి డౌన్‌టౌన్ దుబాయ్, పామ్ జుమేరా, దుబాయ్ మెరీనాలలోనూ ఎయిర్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును స్కైపోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఎయిర్ టాక్సీలు అంటే.. ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగపడుతున్న డ్రోన్ల కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే క్వాడ్ కాప్టర్ల వంటి వాటిని ఎయిర్ టాక్సీలు అంటారు. ఇవి ఆకాశమార్గంలో ఇద్దరి నుంచి ఆరుగురిని స్వల్ప దూరాలకు తీసుకెళ్లగలవు. తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకోవటానికి ఈ సేవలు ఉపయోగపడతాయి.



## ట్రంప్ గాల్లో మేడలు కడుతున్నారు

### ట్రంప్‌వి అబద్ధపు ప్రకటనలు ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్

**టెహ్రాన్, ఏప్రిల్ 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాల్లో మేడలు కడుతున్నారని ఇరాన్ మీడియా వెక్కిరించింది. ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సెటైర్లు వేసింది. ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌తో త్వరలో ఓ ఒప్పందం కుదరనుందని తెలిపారు. దీంతో వారు మాకు ఉచితంగా చమురు, హర్మూజ్ జలసంధిని అందించనున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఎగతాళి చేసింది. ట్రంప్ మాట్లాడుతున్న వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. దీనికి 'అమెరికా అధ్యక్షుడు గాల్లో మేడలు కడుతున్నారు' అని పేర్కొంది. ఈ సందర్భంగా ట్రంప్ ఎక్కువగా ఊహించుకుని, తప్పులకు పాల్పడుతున్నారనే ఉద్దేశం వచ్చేలా ఒక సామెతను కూడా అది ప్రస్తావించింది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తమకు అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్ ఈ వాదనలను కొట్టిపారేసింది. ఇప్పటివరకు అలాంటి ఒప్పందం ఏదీ జరగలేదని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ట్రంప్ మరో అబద్ధపు ప్రకటన చేశారని తెలిపాయి. అలాంటి పెద్ద పురోగతి ఏదీ సాధించలేదని.. ఇరాన్ షరతులన్నింటికీ అమెరికా అంగీకరిస్తేనే చర్చలు కొనసాగుతాయని స్పష్టంచేశాయి.

# హర్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన..

- **నౌకల రాకపోకలకు లైన్‌క్లియర్**

**టెహ్రాన్, ఏప్రిల్ 17 :** పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు




కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ట్రంప్ ధన్యవాదాలు చెప్పారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

ఇరాన్ ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్ దూసుకెళ్తోంది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 1 శాతం పెరగ్గా.. ఎస్అండ్పీ 500 సూచీ 0.7 శాతం పుంజుకొంది. నాస్డాక్ కాంపోజిట్ ఒక శాతం మేర లాభపడింది. భారత్ స్టాక్ మార్కెట్ను ప్రతిఫలించే గిఫ్ట్ నిఫ్టీ (ఫ్యూచర్స్) సైతం దాదాపు 300 పాయింట్లు మేర లాభంతో 24,700 పాయింట్ల ఎగువన ట్రేడవుతోంది.

# రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయండి



## అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు

**లఖ్‌నవూ, ఏప్రిల్ 17:** ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

# దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపుతాం

## టీసీఎస్ ఘటనపై సీఎం ఫడ్నవీస్

**నాసిక్, ఏప్రిల్ 17:** టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపులు, మత మార్పిడిలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఈ ఘటన అత్యంత తీవ్రమైనదని.. దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. టీసీఎస్ యాజమాన్యం సైతం ఈ దారుణాన్ని ఖండించిందన్నారు. ఈ ఘటనలకు బాధ్యుల్ని వదిలిపెట్టబోమని.. దీనిపై విచారణకు కేంద్ర దర్యాప్తు సంస్థలను రంగంలోకి దించుతామని తెలిపారు. పోలీసులు ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, విచారిస్తున్నారని పేర్కొన్నారు.



ఈ కేసుపై నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కార్నిక్ మాట్లాడుతూ.. బాధితురాలు తన సమస్యపై పలుమార్లు హెచ్‌ఆర్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదన్నారు. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఇలాంటివి జరుగుతుంటాయని నిర్లక్ష్యంగా మాట్లాడి పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన సహోద్యోగిపై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో తనను మోసగించినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసే క్రమంలో మరో ఏడుగురు మహిళలు ముందుకొచ్చి.. తమపై జరిగిన వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరి నుంచి 2026 మధ్య పని ప్రదేశంలో తమపై లైంగిక వేధింపులు జరిగినట్లు సదరు మహిళా ఉద్యోగులు వాపోయారు.

# ఆ నౌకలను కూడా టార్గెట్ చేస్తాం: అమెరికా

**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** పశ్చిమాసియాలో యుద్ధం త్వరలో ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు ఒకవైపు.. అదే సమయంలో ఇరాన్‌ను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తామని ఆయన యంత్రాంగం వ్యాఖ్యలు మరోవైపు ప్రపంచాన్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. హర్మూజ్ దిగ్బంధనం మొదలుకావడానికి ముందు బయల్దేరిన ఇరాన్‌తో సంబంధం ఉన్న నౌకలను టార్గెట్ చేస్తామని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కైన్ హెచ్చరించారు. ''ఇరాన్ జెండా ఉన్న నౌకలను లేక ఆ దేశానికి సహాయం చేయడానికి ప్రయత్నించే నౌకలను లక్ష్యంగా చేసుకుంటాం'' అని పెంటగాన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆ ప్రభుత్వానికి సహాయపడే సరకు (ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, లోహాలు వంటివి)ను మోసుకెళ్లే వాటిని అడ్డుకుంటామని చెప్పారు. ఆ నౌకలు ఉన్న ప్రదేశంతో సంబంధం లేకుండా వాటిని తనిఖీ చేసి, స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ నడుస్తోంది. కొన్ని రోజుల్లో అది ముగియనుంది. ఇప్పటికే ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను హర్మూజ్ దిగ్బంధనంతో అమెరికా అడ్డుకుంటోంది. రెండో దఫా చర్చలకు సిద్ధమవుతోన్న తరుణంలో.. తాజా ప్రకటన టెహ్రాన్‌పై మరింత ఒత్తిడి పెంచనుందని తెలుస్తోంది.




హర్మూజ్‌లో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఐరాసలో భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇరువర్గాలు సంయమనం పాటిస్తూ, ఉద్రిక్తతలు తగ్గించాలని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పిలుపునిచ్చారు. సురక్షిత నౌకాయానాన్ని పునరుద్ధరించాలని కోరారు. భారత దేశ ఇంధన, ఆర్థిక ప్రయోజనాలకు సముద్ర భద్రత అత్యంత కీలకమన్నారు. ఈ ఘర్షణల బాధితుల్లో భారతీయులు ఉన్నారని చెప్పారు. నౌకల్లోని నావికులు ప్రాణాలు కోల్పోయారని ఆందోళన గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలంటూ భారత దేశ సందేశాన్ని హరీశ్ వినిపించారు.



## గంజాయితో పట్టుబడ్డ ఎయిరిండియా కోపైలట్

### వెనక్కి పంపిన అమెరికా

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 17:** ఎయిరిండియా కోపైలట్ ఒకరు శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో గంజాయితో పట్టుబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం అతడు 'స్టాఫ్ ఆన్ డ్యూటీ' కింద ప్యాసింజర్ క్యాబిన్లో ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అతడు విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ క్రమంలో శాన్‌ఫ్రాన్సిస్కోలో అధికారులు చేసిన తనిఖీల్లో కోపైలట్ బ్యాగ్‌లో గంజాయి బయటపడింది. దీంతో వారు ఎయిరిండియాకు సమాచారం అందించారు. అనంతరం అమెరికా అధికారులు కోపైలట్‌ను వేరే విమానంలో భారత్‌కు పంపించారు. ఏప్రిల్ 14న జరిగిన ఈ ఘటనపై డీజీసీఏకు ఎయిరిండియా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఎయిరిండియా సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. చట్ట ఉల్లంఘనలను తాము ఏమాత్రం ఉపేక్షించబోమని పేర్కొంది. కంపెనీ నిబంధనల ప్రకారం సదరు కోపైల్ప క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపింది. గతంలోనూ ఎయిరిండియాకు చెందిన ఓ పైలట్ ఇదే విధంగా నిబంధనలు ఉల్లంఘించి అధికారులకు పట్టుబడ్డారు. డిసెంబర్ 2025లో వాంకోవర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానానికి చెందిన ఎయిర్ ఇండియా కెప్టెన్ రెండు బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో విఫలమయ్యారు. దీంతో కెనడా అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ ఎన్నిక

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ ఎన్నికయ్యారు. వరుసగా మూడుసార్లు ఆయన ఉప సభాపతి పదవిని చేపట్టడం విశేషం. ఏప్రిల్ 10న హరివంశ్ డిప్యూటీ ఛైర్మన్‌గా రాజీనామా చేశారు. అనంతరం రాజ్యసభకు నామినేట్ అయిన ఆయన మళ్లీ ఆ పదవికి ఎన్నికయ్యారు.



హరివంశ్‌ను ఉపసభాపతిగా ఎన్నుకోవడానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ, ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నామినేటెడ్ సభ్యుడు డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవడం ఇదే మొదటిసారి. ఉప సభాపతి ఎన్నిక అనంతరం మోడీ మాట్లాడుతూ.. ''వరుసగా మూడోసారి హరివంశ్ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికవడం హర్షనీయం. ఆయనపై సభకు ఉన్న ప్రగాఢమైన నమ్మకానికి ఇది నిదర్శనం. అనుభవం, సభలో అందరినీ ఒకతాటిపై నడిపించడానికి ఆయన చేసిన ప్రయత్నాల వల్ల సభకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని'' ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ''డిప్యూటీ ఛైర్మన్ సభలో ప్రతిపక్షానికి తగిన ప్రాధాన్యం, సమయం ఇస్తారని నమ్ముతున్నా'' అని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. ఇదిలాఉండగా, హరివంశ్ ఎన్నికకు ముందే సమాజవాద్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్‌లు సభ నుంచి వాకౌట్ చేశాయి.

# కేవలం రెండు నెలలే యుద్ధం చేశాం

- **కేవలఅమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** ఇరాన్తో యుద్ధం విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో రెండు నెలలే యుద్ధం చేశామని అన్నారు. అమెరికా చేసిన ఇతర యుద్ధాలు 18 ఏళ్లు, నాలుగేళ్లు కొనసాగాయని తెలిపారు. తాజా యుద్ధంలో తాము త్వరలోనే విజయం సాధించనున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగకపోయుంటే.. చెడు పరిణామాలు చోటుచేసుకొనేవన్నారు. ఇక, ఇరాన్‌లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకోవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. చమురు ధరల గురించి ప్రస్తావిస్తూ.. రానున్న వారం రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దాం అని అన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించాలా, వద్దా అనే దానిపై ఇంకా స్పష్టత లేదన్నారు. టెహ్రాన్ తమతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం తాము ఆ విషయం పైనే దృష్టిసారించామని, చర్చల్లో పురోగతి సాధిస్తే.. కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ వారాంతంలో తదుపరి చర్చలు జరగవచ్చని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ట్రంప్ పునరుద్ఘాటించారు. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తమకు ఇచ్చేందుకు అది అంగీకరించిందన్నారు. ఇది గొప్ప విషయంగా అభివర్ణించారు. దీంతో త్వరలో జరగనున్న చర్చలు సానుకూలంగా ఉండవచ్చని ఆశాభావం వ్యక్తంచేశారు.

# భారత్, పాక్ పోటాపోటీగా ఆయుధ పరీక్షలు

- **ఇరు దేశాలు నోటమ్‌లు జారీ**

**ఢిల్లీ, ఏప్రిల్ 17:** క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్-పాకిస్థాన్లు ఒకేసారి నోటమ్లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 20, తెల్లవారుజామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్‌మెన్', 'మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంటాయి. ఆపరేషన్ సిందూర్ జరిగిన ఏడాది తర్వాత ఈ ఆయుధ పరీక్షలపై ప్రకటనలు వెలువడడం గమనార్హం.

## కుప్పకూలిన హెలికాప్టర్.. 8 మంది మృతి

**మెల్వాయ్, ఏప్రిల్ 17:** హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన ఇండోనేసియాలోని పశ్చిమ కాళీమంతన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకొంది. దాని శకలాల



గుర్తింపు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ''ఎయిర్ బస్ హెచ్-130 గురువారం మెల్వాయ్‌లో టేకాఫ్ అయిన కొంత సమయానికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్రూంతో సంబంధాలు తెగిపోయాయి. ఓ కొండపై దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ సిగ్నల్ మిస్ అయింది. టేకాఫ్ అయిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెస్క్యూ బృందం హెలికాప్టర్ తోక భాగాన్ని గుర్తించింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్లో ఉన్న ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సిఉంది'' అని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- ఆ జాగ్రత్త ప్రయాణం ప్రాణాలకు ముప్పు
- రోడ్డు భద్రత పరిణామాలపై ప్రభుత్వం అవగాహనలు
- జైళ్ల శాఖ డీజి సౌమ్య మిశ్రా

సూర్యాపేట, ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి): రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా నుండి రోడ్డు భద్రత పై నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా పిల్లలమర్రి వద్ద బ్లాక్ స్పాట్స్ లను పరిశీలించారు. పిల్లలమర్రి చౌరస్తా వద్దగల రుద్రంగి కన్వెన్షన్ హాల్ నందు పోలీస్ శాఖ ఆద్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు నలమద పద్మావతి రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదలతో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని, ఈ నేపద్యంలో రోడ్డు భద్రత ను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకై అవగాహన కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. రోడ్డు మీద అజాగ్రత్తగా ప్రయాణం చేస్తే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, ఓవర్ స్పీడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సిట్ బెల్ట్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దేశంలో 2023లో రోడ్డు ప్రమాదలలో 4.5లక్షల మంది మృత్యువాత పడ్డారని వివరించారు. ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్ తో వాహనాలను నడుపుతూ ప్రమాదలకు గురవుతున్నారని, ఓవర్ స్పీడ్ వెళ్లకుండా జాగ్రత్తగా వాహనం నడిపితే దాదాపు 50శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. అదే విదంగా సెల్ ఫోన్ నడుపుతూ వాహనాలను డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ ధరిస్తే ఆక్సిడెంట్ సమయంలో ప్రాణాలను నిలిచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు వీటిని ఆచరణ చేస్తే చాలని వీటితోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణ సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తు జాగ్రత్తగా ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరు బాధ్యత గా ఉంటూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రాణాలను నిలుపుకోవలని, ముఖ్యంగా డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నియమ నిబందనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సూర్యాపేట జిల్లాకు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రాణాలకు కాపాడాలని సంకల్పం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### భద్రతగా గమ్యస్థానాలకు చేరడమే అరైవ్ అలైవ్ లక్ష్యం

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ... రోడ్డు ప్రయాణ సమయంలో భద్రతగా గమ్య స్థానాలకు చేరుకోవాడమే అరైవ్ - అలైవ్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జిల్లాలో దాదాపు 200కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు, 3600కిలో మీటర్ల మేరకు గ్రామీణ రోడ్లు విస్తరించి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేల సూర్యాపేట జిల్లాలో రోడ్డు భద్రతపై వివిధ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదలతో అనేక మంది చనిపోతున్నారని 2023 సంవత్సరంలో 257 మంది, 2024 లో 278 మంది, 2025లో 230మంది, 2026 ఏప్రిల్ వరకు 78 మంది



రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లు చెప్పారు.ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ సేఫ్టీ పై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి కోల్పోతే కుటుంబం అంత రోడ్డు మీద పడుతుందని కావున రోడ్డు ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ రోడ్డు సేఫ్టీ కమిటీ, మండల స్థాయిలవ మండల రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా 45 బ్లాక్ స్పాట్ లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలోని రోడ్ల పై లోపాలను గుర్తిస్తే ప్రతి ఒక్కరూ భాద్యతగా వాటి సమాచారం అందించాలని కోరారు. సిట్ బెల్ట్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయకూడదని గ్రామాలలో తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### రోడ్డు ప్రమాదాలు చూస్తే ఆవేదన కలుగుతుంది ఎమ్మెల్యే పద్మావతి

అరైవ్ - అలైవ్ అద్భుతమైన కార్యక్రమం అని కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద గణాంకాలు పరిశీలిస్తే ఆవేదన కలుగుతుందని, అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత కార్యక్రమం అద్భుతమైనదని దీని ద్వారా ప్రజలు మరింత చైతన్యమంత అవుతున్నారని ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర పోలీస్ శాఖ కు అభినందనలు తెలియజేస్తున్నారని అన్నారు. అరైవ్ అలైవ్ అనేది ఒక పదం కాదు ఇది ఒక మహా ఉద్యమం అన్నారు. వాహనదారులు ప్రజలు యువత ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో రహదారి నియమాలు పాటించాలని పోలీసు వారి సూచనలు పాటించాలని ట్రాఫిక్ నియమయ నిబంధనలు పాటించాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రమాదం మరణాలను నివారించవచ్చని తెలిపారు. ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు అక్కడ ఉన్న ప్రజలు స్పందించి క్షతగాత్రులకు సహకారాలు అందించాలని త్వరితగతిన ఆసుపత్రులకు తరలించాలన్నారు.

### రోడ్డు భద్రత పై విస్తృత కార్యక్రమాలు ఎస్పీ

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పట్ల విస్తృత అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...అరైవ్ అలైవ్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ముందుకు పోతున్నామన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం నాలుగు లక్షల పైగా రోడ్డు ప్రమాదాల సంభవిస్తున్నాయని, సూర్యాపేట జిల్లాలో గత సంవత్సరం 600 పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాద సమయంలో ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యమైతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రమాద సంఘటనలో బాధితులకు సహాయ సహకారాలు అందించాలని అలాంటివారిని రహదారి హీరోగా గుర్తించి ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రతపై గ్రామాలు, మహిళా సంఘాలు తీర్మాన పత్రాలను అధికారులు అందించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల ద్వారా గ్రామాలలో ప్రజలు, మహిళా సంఘాలు చైతన్యవంతం అవుతున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వాహనాలు నడుపుతామని, మా కుటుంబ సభ్యులు, మా గ్రామ ప్రజలు హెల్మెట్ సీట్ బెల్ట్ దరిస్తారని తీర్మానాలు చేసి తీర్మాన పత్రాలను జిల్లా అధికారులకు అందించారు. అనంతరం రోడ్డు ప్రమాద ఘటనలో సహాయ సహకారాలు అందించిన వ్యక్తికి సన్మానం. చివ్వెంల మండల పరిధి జాతీయ రహదారి 65 ఏచర్ల ముత్యాలమ్మ గుడి వద్ద ఏసీ డీసీఎం, టాటా ఏసీ రోడ్డు ప్రమాదం సంభవించగా సంఘటనలు క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించి 108 కి, పోలీసు వారికి వేగంగా సమాచారం అందించిన వాళ్లభాపురం గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తిని ఈ సందర్భంగా అధికారులు సన్మానించారు. రోడ్డు ప్రమాద సంఘటనల్లో స్పందించి సహకారాలు అందించే వారిని రహదారి హీరోగా కీర్తించడం జరుగుతుందన్నారు.



### పోలీసు కళాబృందం నాటకం ప్రదర్శన

ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భూలోకం, యమలోకం అనే నాటక ప్రదర్శన ఆకట్టుకున్నది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ నాటక ప్రదర్శన నందు వివరించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం గురించి నాటక ప్రదర్శన ద్వారా వివరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన మద్యం మత్తులో వాహనాలు నడిపిన జరిగే ప్రాణప్రాయం గురించి ప్రదర్శనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలకు మీడియా ప్రతినిధులకు హెల్మెట్స్ ను అందించి ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించి ప్రయాణించాలని తెలియజేశారు.

### సౌమ్య మిశ్రాకు ఘన స్వాగతం పలికిన పలువురు

తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రాను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నరసింహ జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి పోలీస్ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిఐజి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్టీసీ డిఎం సునీత, ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్, సూర్యాపేట కోదాడ తిరుమలగిరి నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలి

- వడగాల్పులపై కలెక్టర్ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- వడగాల్పు లకు సంబంధించిన సమాచారాన్ని అందించాలి
- కంట్రోల్ రూమ్‌లోని ఫోన్ నెంబర్ 1800425142కు చేయండి
- జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ వెల్లడి



నల్లగొండ-- ఏప్రిల్ 17 (మనం ప్రతినిధి): అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను తక్షణమే పడగాలపులపై జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వడగాల్పుల పై శుక్రవారం అయన జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ ప్రకారం నల్గొండ జిల్లాలో ఏప్రిల్ నుండి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఈ వారంలొనే 41 నుండి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాత్రి సమయాలలో ఆకాశం మబ్బులతో కమ్ముకొని ఉంటుందని చెప్పారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఉపాధి కూలీలు, రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు, మున్సిపల్ సానిటరీ వర్కర్లు, అలాగే పశువులు, పక్షులు అడవులలో ఉండే మృగాలు అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి గురయ్యే ఆస్కారం ఉన్నట్లు తెలిపారు .వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడగాల్పులపై మున్సిపల్ ,గ్రామస్థాయిలో ఇదివరకే కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీలు గ్రామాలలోని ప్రజలు వడదెబ్బ కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు . మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఎవరు బయట తిరుగువద్దని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ,తలపై టోపీ ధరించాలని, నీళ్ల బాటిల్ ,ఓఆర్ ఎస్ పాకెట్లు వెంట ఉంచుకోవాలని, అలాగే అన్ని అంగన్వాడీ కేంద్రాలు,పీహెచ్ సి కేంద్రాలలో తగినన్ని ఓ ఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని అన్నారు. ప్రతి గ్రామంలో అలాగే పట్టణాలలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా చలివేంద్రాలు పెట్టించాలన్నారు .గ్రామ స్థాయిలో పనిచేసే విలేజ్ శానిటేషన్ కమిటీ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు .ఈనెల 18న గ్రామస్థాయిలో వడగాల్పుల పై అవగాహన శిబిరాలు నిర్వహించాలని, వడదెబ్బ సోకితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించాలని, వడదెబ్బకు గురైనప్పుడు చేయవలసిన ,చేయని కూడని వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని చెప్పారు.వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా చేయవలసిన, చేయకూడని వాటిపై సమాచారం రూపొందించాలని, వడగాల్పు పులపై ఆర్డీవోలు, తహసిల్దారులు ప్రతిరోజు నివేదిక పంపించాలని, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా చుట్టుపక్కల గ్రామపంచాయతీలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో ఉన్న పశువుల తోట్లను ఉపయోగంలోకి తీసుకురావాలని, అధిక లోడు కారణంగా ట్రాన్స్ఫార్మర్లు కాలిపోకుండా ముందే అప్రమత్తంగా ఉండాలని, అన్ని అత్యవసర శాఖలు అందుబాటులో ఉండాలని, ప్రత్యేకించి కార్మిక శాఖ ద్వారా కూలీలు పనిచేసే చోట అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రజలకు వడగాల్పులపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి వడదెబ్బకు గురి కాకుండా చూడాలన్నారు. పత్రికలు ,చానళ్లు, సోషల్ మీడియాలో వడ్డదేబ్బపై విస్తృత ప్రచారం కల్పించాలని, అలాగే ప్రజలు వేసవిలో నూనె ఎక్కువగా ఉండే వస్తువులను, వేపుళ్లను తినకుండా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని, వదులు దుస్తులు, కాటన్ దుస్తులు వేసుకోవాలని, జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కూడా అవసరమైన ఓ ఆర్ ఎస్ పాకెట్లు, తాగునీరువంటివి ఏర్పాటు చేయాలన్నారు. వడగాల్పులకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251422 లేదా వాట్సాప్ నంబర్ 6305951279 కు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ధాన్యం సేకరణ పై సమీక్షిస్తూ ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ధాన్యం సేకరణ ను ప్రవేశించాలని, కొనుగోళ్లతో పాటు, రవాణా పెంచాలని, మిల్లర్లు వెంటవెంటనే ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, ఓపి ఎమ్మెస్ ఎంట్రీస్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు రెవిన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడారు.

# గెస్ట్ లెక్చరర్ భవ్యశ్రీకి సన్మానం



కోదాడ, ఏప్రిల్ 17(మనం న్యూస్): అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క ), కోదాడ పాలిటెక్నిక్, టి జి ఆర్జెసి కోచింగ్ సెంటర్ లో గెస్ట్ లెక్చరర్ కి సన్మానం. ది:17-04-2025న ఆస్క కోచింగ్ సెంటర్ లో మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ గా సీవీర్ ఇంజనీరింగ్ కాలేజ్, హైదరాబాద్ లో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న మాతంగి భవ్య శ్రీ క్లాస్ తీసుకోవడం జరిగింది. భవ్య శ్రీ పిల్లలకు గణితం అర్థం అయ్యేటట్లు చెప్పడం వలన విద్యార్థులు చాలా ఆనంద వ్యక్తం చేశారు. అదేవిధంగా భవ్య శ్రీ మాట్లాడుతూ మరో రెండు రోజులు గణితం క్లాసులు తీసుకుంటానని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఆస్క కోచింగ్ సెంటర్ నిర్వాహకులు భవ్యశ్రీ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ యలమర్తి శౌరి, కోర్స్ కో-ఆర్డినేటర్ గంధం. బుచ్చారావు, ఆస్క ప్రధాన కార్యదర్శి మాతంగి.ప్రభాకర్ రావు, ఇన్ స్ట్రక్టర్ కనుకు. శ్రీకాంత్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీజీఈజేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత




పాలకీడు, ఏప్రిల్ 17 (మనం న్యూస్): టీజీ ఈ జెఎసి. రాష్ట్ర, జిల్లా శాఖ పిలుపుమేరకు సూర్యాపేట జిల్లా పాలకీడు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం నందు శుక్రవారం వినతి పత్రం అందజేసిన ఉపాధ్యాయ సంఘాలు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్స్ , పిఆర్సి ,డి ఏ ఆలస్యం చేయడం వివిధ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అలసత్వాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి అనంతరం తాసిల్దార్ కి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు బాలకృష్ణ, సాంబయ్య ,ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన కాపీలను సర్పంచ్‌లకు అందించిన కలెక్టర్




కోదాడ, ఏప్రిల్ 17(మనం న్యూస్): సూర్యాపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రం నందు జిల్లా స్థాయి రోడ్డు భద్రత వారోత్సవాలు కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డిజిపి సౌమ్య మిశ్రా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్, ఎస్పీ నరసింహన్ లు పాల్గొని జిల్లా సర్పంచి లు అందరూ గ్రామపంచాయతీ ముఖ ద్వారంలో 'నో హెల్మెట్ నో ఎంట్రీ 'ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ నందు తీర్మానం చేయించాలని సర్పంచిలకు కాపీలను అందజేసినారు. ఇట్టి కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి, దొరకుంట సర్పంచి పాలకి సురేష్, అడ్లూర్ సర్పంచి, గువ్వల శిరీష వెంకట, మంగలి తండా సర్పంచి ధరావత్ బాబ్జి లు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో మృత్యుంజయ హోమం



అనంతగిరి, ఏప్రిల్ 17 (మనం న్యూస్): తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానం నందు అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మహా మృత్యుంజయ హోమం నిర్వహించడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్త ప్రజల అప మృత్యు భయ దోశాలు తొలగి ఆరోగ్యముగా జీవించాలని హోమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా సలహాదారులు జగిని ప్రసాద్, పి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలి



పెన్ పహాడ్ ఏప్రిల్ 16(మనం న్యూస్): ధాన్యం కాంటాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు మండల పరిధిలోని పెన్ పహాడ్, అనంతారం గ్రామాల్లోని పిఏసిఎస్, మాచారం, అనాజిపురం గ్రామాలలో ఐకెపిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడుతూ రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఎటువంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా కాంటాలు జాగ్రత్తగా వేయాలని, సకాలంలో లారీలకు ఎగుమతి చేయాలని, గన్ని బస్తాలు ఏర్పాటు చేయాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు వర్షాలు వచ్చినా ధాన్యం తడవకుండా నల్ల టార్పాలిన్ పట్టాలను రైతులు అందించాలన్నారు అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి సాదా బైనామా దరఖాస్తులను తొందరగా పరిశీలించి పంపించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఐ రంజిత్ రెడ్డి, ఏ ఆర్ ఐ అజీజ్ ఉన్నిసా, సీనియర్ అసిస్టెంట్ రాధ, జిపిఓలు మడిపడిగా యాదగిరి, వీరస్వామి, ఏ ఈ ఓ లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి



- నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, ఏప్రిల్ 17 ( మనం ప్రతినిధి): వేసవి సీజన్ దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పర్యవేక్షణ జరపాలని చూడాలన్నారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, ఆర్మూర్ మండలాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలంలోని ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతు పనులు తదితర వాటి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గతేడాది వేసవిలో ఏయే ప్రాంతాల్లో దాహార్తి సమస్యలు ఉత్పన్నం అయ్యాయని ఆరా తీశారు. ఈసారి ఎల్‌నినో ప్రభావం వల్ల సరిపడా వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నందున, తాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని, చివరి ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాల్లోని నివాసాలకు సైతం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని, సకాలంలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మంచినీటి కోసం ప్రజలు నిరసనకు దిగితే, సంబంధిత ఎంపీడీవోలను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులతో సమన్వయాన్ని పెంపొందించుకుని, ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డుల్లో ప్రజల అవసరాలకు సరిపడా పూర్తిస్థాయిలో రక్షిత మంచినీటి సరఫరా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. చేతి పంపులు, బోరు బావులకు తక్షణమే ఫ్లషింగ్ చేయించాలని చెప్పారు. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఆటంకం కలిగేలా పైప్‌లైన్లను ధ్వంసం చేయడం, వాల్వ్ లకు నష్టం చేకూర్చే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని కలెక్టర్ చెప్పారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీవోలు, ఏఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాజేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్, మిషన్ భగీరథ ఈఈ రాకేష్, నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, ఏఈలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# జిల్లాలో రబీ సీజన్కు వరి కొనుగోలు ఏర్పాట్లు పక్కాగా చేయాలి

- వరి కొనుగోలులో అధికారులు ఎక్కడైనా అలసత్వం ప్రదర్శించినా
- కఠిన చర్యలు తప్పవు
- కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులకు వేసవి కాల దృష్ట వసతులు ఏర్పాటు చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఐ.డీ.ఓ.సీ భవనంలో సన్నాహక, వరి కొనుగోళ్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే రబీ 2025-26 సీజన్కు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా మార్కెటింగ్, రవాణా, లీగల్ మెట్రాలజీ అధికారులు, డీసీఓల, సీఈఓలు, డీఆర్డీఓల, ఏపీఎంలు, మండల వ్యవసాయ అధికారులు, వరి, గన్నీ రవాణా కాంట్రాక్టర్లు, ఏఎంసీ కార్యదర్శులు, సివిల్ సప్లైస్ అధికారులు, బాయిల్డ్, రైస్ మిల్లుల ప్రతినిధులతో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అమరేందర్, ఉన్నతాధికారులతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించడం, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్రంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, ధాన్యం సేకరణ గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో, నిల్వల వద్ద ఆలస్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రబి సీజన్లో 1,87418 ఎకరాల్లో దాదాపుగా 1 లక్ష 20 వేల మంది రైతుల నుండి 4 లక్షల 44033 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారన్నారు. రైతులు తమ పంటకు న్యాయమైన ధర పొందేలా ప్రభుత్వం చేపట్టిన వరి కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. వరికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించిన సాధారణ రకం రూ. 2,369/క్వింటాల్, ఏ-గ్రేడ్ రకం రూ. 2,389/క్వింటాల్ మద్దతు ధర ప్రకారం రైతులకు అందించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా క్వింటాలుకు రూ. 500 చొప్పున రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రవాణా ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా పరిపాలన కఠిన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కాంట్రాక్టర్లు నిర్దేశించిన సంఖ్యలో వాహనాలను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైన ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రతి సెక్టార్కు సుమారు 25 ప్రత్యేక లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. నిల్వ గిడ్డంగులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. ధాన్యం నాణ్యత కాపాడే చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని స్వీకరించి సమయానికి మిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ఉండటానికి రవాణా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈ క్రమంలో, వాహనాల కొరత కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం జరిగితే సంబంధిత ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన లారీలు ఏర్పాటు చేయడంలో విఫలమైతే, ఆయా కాంట్రాక్టర్లను బ్లాక్లిస్ట్లో చేర్చే అవకాశం ఉందన్నారు. రవణ పరంగా ఇబ్బందులు తలెత్తితే సస్పెన్షన్ చేస్తానని డీఎం సివిల్ సప్లై ను కలెక్టర్ హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రైతులు కేంద్రాలకు వచ్చిన వెంటనే వారి ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి నమోదు చేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తీవ్ర ఎండల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలన్నారు. ముఖ్యంగా త్రాగునీటి సదుపాయం, విశ్రాంతి కోసం నీడ ఏర్పాట్లు, అవసరమైన చోట తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవలి కాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైతులు పంటల విక్రయం కోసం గంటల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తగిన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధ రైతులు, మహిళా రైతులు తీవ్ర ఎండల కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో చల్లని త్రాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ఫ్యాన్లు లేదా గాలి సౌకర్యం కల్పించే చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదనంగా అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. తప్పనిసరిగా ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడడం ప్రభుత్వ ప్రాధాన్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. రబి సీజన్లో అకాల వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసే పంట తడవకుండా అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గన్ని బ్యాగులు తగిన మోతాదులో నిల్వ ఉంచాలన్నారు. అవసరమైనప్పుడు వెంటనే రైతులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా ఉండేందుకు ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా తార్పాలిన్ కవర్లు (తాట్పల్లిన్) సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అవసరమైన సదుపాయాలన్నీ సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల పట్ల అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తేనే కొనుగోలు ప్రక్రియ విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రతి అధికారి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- ఏసీపీ ప్రశాంత్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ లావుడియా రవి నాయక్
- అరైవ్ అలైవ్ ప్రచారానికి ప్రజల మద్దతు



**హనుమకొండ, ఏప్రిల్ 17 మనంన్యూస్:** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ ప్రచారంలో భాగంగా హసన్పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీఐ చేరాలు ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు.సుమారు 100 మందికి పైగా గ్రామస్తులు పాల్గొని రోడ్డు భద్రతపై ప్రమాణం చేశారు. గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏసిపి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.హెల్మెట్ను ధరించడం వల్ల వారి ప్రాణాలకు, బంగారు భవితకు రక్షణ కల్పించిన వారమవుతామన్నారు.మనం ధరించే హెల్మెట్ వల్ల అది మన ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తలకు తగిలే చిన్న గాయం కూడా ప్రాణాంతకం కావచ్చుఆ ప్రమాదం నుండి మనల్ని రక్షించేది ఒక్క హెల్మెట్ మాత్రమేనాని అన్నారు.మీరు వాహనంపై బయటకు వెళ్ళినప్పుడు.. ఇంటి వద్ద మీ కోసం మీ భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు ఎదురుచూస్తుంటారని మర్చిపోవదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి ,గోవర్ధన్ , స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవినాయక్ ,రిలీఫ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రమేష్ ,గ్రామ పెద్దలు, యువకులు,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల్లో ప్రాణరక్షణకు 'గోల్డెన్ అవర్' ఎంతో కీలకం

- నాగర్కర్నూల్లో సీపీఆర్ అవగాహన కార్యక్రమం
- ప్రాణరక్షణలో పోలీస్ పాత్ర కీలకం కానుంది
- జిల్లా కలెక్టర్ స్వయంగా సిపిఆర్ నిర్వహణ
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో రోడ్డు భద్రత, ప్రజల ప్రాణాల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించినఅరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఆర్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ స్వయంగా సిపిఆర్ నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల సమయంలో తక్షణ స్పందన, గాయపడిన వారికి ప్రాణరక్షణ కల్పించే గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతతో పాటు సీపీఆర్ నిర్వహణపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్ పోలీస్ అధికారులకు విస్తృతంగా శిక్షణ, అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరై మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించడం మంచిదన్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రమాదం జరిగిన తొలి గంటను గోల్డెన్ అవర్ గా పరిగణిస్తారన్నారు. ఈ సమయంలో అందించే వైద్య సహాయం అత్యంత కీలకమని కలెక్టర్ వివరించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న వెంటనే బాధితుల పరిస్థితిని అంచనా వేయడం, అవసరమైన ప్రాథమిక వైద్య సహాయం అందించడం, అలాగే సీపీఆర్ నిర్వహణ ద్వారా గుండె ఆగిపోయిన వ్యక్తుల్లో ప్రాణం నిలుపుకునే అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రతి పోలీస్ అధికారి ఈ నైపుణ్యాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. ఇది కేవలం విధి నిర్వహణకే కాకుండా సమాజ సేవలోనూ కీలకమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. రోడ్డు భద్రతా చర్యలు కేవలం నియమాలు అమలు చేయడానికే పరిమితం కాకుండా, ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉండాలని తెలియజేశారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు ట్రాఫిక్ నియమాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. వాహనదారుల్లో బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా నిపుణుల ఆధ్వర్యంలో సీపీఆర్ నిర్వహణ విధానాన్ని ప్రాక్టికల్గా ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, బాధితుడిని ఎలా ఉంచాలి, ఛాతీపై ఒత్తిడి ఎలా ఇవ్వాలి వంటి అంశాలను వివరంగా చూపించారు. పోలీస్ అధికారులు కూడా ప్రత్యక్షంగా పాల్గొని సీపీఆర్ పద్ధతులను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు ఏప్రిల్ 17, మనం ప్రతినిధి:** ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మండలం రాయినిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో శనివారం సాయంత్రం 5 గంటలకు ₹రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క₹ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని సర్వాపురం, రాయిని గూడెం గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## మంజూరైన ప్రతి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిగా పూర్తి చేయాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 17 (మనం బ్యూరో):** శుక్రవారం నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కలెక్టర్ పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల్లో ఏలాంటి ఆలస్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న గృహాల నాణ్యత, వేగం, లబ్ధిదారుల అవసరాల తీరు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తూ, పనుల నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయో గృహ నిర్మాణదారుల లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే తక్షణమే సరిచేయాలన్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యంగా గృహనిర్మాణ పథకాల ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇల్లు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించలన్నారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య, నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను సమీక్షించలన్నారు. పనులు నెమ్మదిగా ఉన్న చోట వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి పనులను సమయానికి పూర్తి చేయాలన్నారు. పనుల పర్యవేక్షణను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే పనుల పురోగతిపై మున్సిపల్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రతి దశలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది మధ్య సమన్వయం లోపించకుండా అన్ని శాఖలు కలిసి పనిచేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, హౌసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటిద్దాం

- ఎండ తీవ్రత నుండి సురక్షితంగా ఉందాం
- లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ సూచన



**హనుమకొండ, ఏప్రిల్ 17 (మనం న్యూస్):** ఎండ ఎక్కువగా ఉన్న రోజుల్లో గొడుగు తప్పనిసరిగా వాడాలి దూదితో నేయబడిన తెలుపు/లేత రంగు పలుచటి వస్త్రాలను ధరించాలి బహిరంగ ప్రదేశాలలో నెత్తికి టోపీ లేదా రుమాలు పెట్టుకోవాలిఉప్పు కలిపిన మజ్జిగ గ్లూకోజు కలిపిన నీరు ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఖఖీ) తీసుకోవాలివడదెబ్బకు గురైన వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలిచల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరం అంతా తుడవాలిబాధితులని ఫ్యాను క్రింద ఉంచాలి సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిలో ఆశించిన మార్పు లేనిచో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ తెలిపారు.

## ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఎఫ్రీ చైల్ రీడ్స్ ద్వారా పఠనంలో గణనీయమైన పురోగతి
- ఉపాధ్యాయుల కృషి ఫలితం 29 వేల మంది విద్యార్థులకు పఠన నైపుణ్యాలు
- ఇండిపెండెన్స్ డే నాటికి వంద శాతం లక్ష్యం సాధించాలి
- చదవడం, అర్థం చేసుకోవడం, ప్రవాహంగా మాట్లాడడం కీలకం
- ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన
- ఎవ్రీ చైల్ రీడ్స్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్



**ముదిగొండ, ఏప్రిల్ 17(మనం న్యూస్):** ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎవ్రీ చైల్ రీడ్స్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి పఠన నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్కిట్లు ప్రదర్శించడం, కథలు చదవడం, ఆత్మ విశ్వాసంతో పఠనం చేయడం వంటి కార్యక్రమాలు చూసి తాను ఎంతో ఆనందానికి లోనయ్యానని కలెక్టర్ తెలిపారు. ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం ప్రారంభించిన ఉద్దేశ్యం నెరవేరుతోందని, సాధించిన పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు. చదవడం ఒక అత్యంత ముఖ్యమైన నైపుణ్యమని, చదవగలిగితే రాయడం, మాట్లాడడం సులభమవుతాయని అన్నారు. చదవలేని పిల్లలకు ఆత్మవిశ్వాసం తగ్గిపోతుందని, ఈ సమస్యను ప్రారంభ దశలోనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 29 వేల మంది విద్యార్థులు పఠన నైపుణ్యాలు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని స్వంతంగా స్వీకరించి విజయవంతం చేయడం అభినందనీయమని, ప్రతి ఉపాధ్యాయునికి తన అభినందనలు తెలియజేశారు. ప్రారంభంలో కేవలం 12-13 శాతం మంది విద్యార్థులు మాత్రమే వాక్యాలు చదవగలిగితే, ప్రస్తుతం అది 84 శాతానికి పెరగడం ఉపాధ్యాయుల కృషి ఫలితమని తెలిపారు. మిగిలిన 16 శాతం మంది విద్యార్థులు కూడా పఠన నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఒక గంట సమయం కేటాయిస్తూ పఠన నైపుణ్యాల పెంపుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని కొనసాగించి, ఇండిపెండెన్స్ డే నాటికి 100 శాతం పఠన నైపుణ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. వాక్యాలు చదవడమే కాకుండా, ప్రవాహంగా చదవడం, అర్థం చేసుకోవడం కూడా సమానంగా ముఖ్యమని అన్నారు. 3వ తరగతికి నిమిషానికి 30 పదాలు, 4వ తరగతికి 40 పదాలు, 5వ తరగతికి 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదివిన విషయాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేకంగా రూపొందించిన టిఎల్ఎం చాలా ఉపయోగకరంగా ఉందని, ముదిగొండలో నిర్వహించిన టిఎల్ఎం మేళా, పోటీలు ప్రశంసనీయమని తెలిపారు. బడి బాట కార్యక్రమంలో ఎవ్రీ చైల్ రీడ్స్ వీడియోలను ప్రదర్శించి, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమం కలెక్టర్గా తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని, ఒకసారి పిల్లలు చదవడం ప్రారంభిస్తే వారికి ఇక ఎలాంటి అడ్డంకి ఉండదని తెలిపారు. ఆనతరం ప్రతిభ కనబడిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటో, ప్రశంస ప్రతాలను కలెక్టర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆ క్యాచ్ తర్వాత.. ముంబయి దూకుడు ఆగింది: శ్రేయస్ అయ్యర్



వాంఖడే వేదికగా ముంబయి ఇండియన్స్ పై పంజాబ్ కింగ్స్ అద్భుత విజయం సాధించింది. భారీ స్కోరు చేస్తుందేమో అనుకున్న ముంబయికి తమ ఫీల్డింగ్, బౌలింగ్ తో పంజాబ్ అడ్డుకట్ట వేసింది. మరీ ముఖ్యంగా అర్ష్ దీప్ స్పెల్ తోపాటు హార్దిక్ పాండ్య (17.3వ ఓవర్) ఇచ్చిన క్యాచ్ ను బౌండరీ లైన్ వద్ద సూపర్ గా ఒడిసిపట్టిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కు ఈ క్రెడిట్ దక్కుతుంది. అప్పటికే ముంబయి స్కోరు 175 పరుగులు. ఆ తర్వాత ముంబయి 21 బంతుల్లో కేవలం 20 పరుగులే చేయడం గమనార్హం. మ్యాచ్ అనంతరం శ్రేయస్ కూడా ఆ క్యాచ్ వల్లే ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్ లో దూకుడు తగ్గించగలిగినట్లు వెల్లడించాడు. ఇక లక్ష్య ఛేదనలోనూ హాఫ్ సెంచరీతో శ్రేయస్ ఆకట్టుకున్నాడు. ఛేజింగ్ కింగ్ గా ఉన్న విరాట్ కోహ్లీ సరసన చేరేలా శ్రేయస్ ఆటతీరు ఉంది.

''లీగ్ లో ప్రతి మ్యాచ్ లో గెలుస్తామనే నమ్మకం, ఆశావాదంతోనే ఉన్నాం. అలాగే ముందుకుసాగుతున్నాం. అదే సమయంలో మనకు సరైన విచక్షణ కూడా అవసరం. మైదానంలోకి దిగాక ప్రతి మ్యాచ్ అత్యంత కీలకమని తెలుసుకోవాలి. జట్టుగా ఆడి విజయం సాధించాం. ప్రభ్ సిమ్రన్ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. పవర్ ప్లేలో అద్భుతమైన ఆరంభాలు ఇస్తున్నాడు. ఇప్పుడు మ్యాచ్ ను ముగించేవరకూ ఉండేంత పరిణతి సాధించాడు. ముంబయి ఇండియన్స్ ను మా బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. అయితే, బౌండరీ లైన్ వద్ద హార్దిక్ క్యాచ్ తోనే వారి దూకుడుకు అడ్డుకట్ట పడింది. ఒక్కోసారి ప్రత్యర్థి జట్టు ఆధిపత్యం సాధించినా.. పుంజుకొని మరీ వారిని ఆపిన సందర్భాలు ఉన్నాయి. సన్ రైజర్స్ తోనూ పవర్ ప్లేలో భారీగా పరుగులు ఇచ్చాం. కానీ, ఆ తర్వాత కట్టడి చేయడంలో మా బౌలర్ల కృషి అద్భుతం. ఇక టాస్ ల పరంగానూ నేను లక్కీ. మాకు కలిసొస్తోంది. పంజాబ్ కింగ్స్ కూ అభిమాన గణం పెరిగింది. ఈ విషయంలో చాలా సంతోషంగా ఉంది. మున్ముందు రోజుల్లోనూ ఇంకా పెరిగే అవకాశం లేకపోలేదు'' అని శ్రేయస్ వెల్లడించాడు.

## అచ్చిరాని జెర్సీ..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2011 సీజన్ నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కచ్చితంగా ఒక మ్యాచ్ లో గ్రీన్ జెర్సీలో బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే. 'గో గ్రీన్' కార్యక్రమంలో భాగంగా ఆర్ సీబీ దీనిని పాటిస్తూ వస్తోంది. పచ్చదనాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని ఇవ్వడానికే తమ రెగ్యులర్ జెర్సీని లేత ఆకుపచ్చ రంగులోకి మార్చుకుంది.

ఈ సంప్రదాయాన్ని ఆర్సీబీ 2026 సీజన్ లోనూ కంటిన్యూ చేయనుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఢిల్లీ క్యాపిటల్స్ తో జరగనున్న పోరులో ఆర్సీబీ ఆటగాళ్లు గ్రీన్ జెర్సీలతో దర్శనమివ్వనున్నారు. ఈ సీజన్ లో మంచి జోష్ మీదున్న ఆర్సీబీ ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్ ల్లో4 విజయాలతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.

**అచ్చిరాని జెర్సీ..**

అయితే ఆర్ సీబీకి ఈ గ్రీన్ జెర్సీ మ్యాచ్ లు పెద్దగా కలిసి రాలేదు. ఇప్పటివరకు 15మ్యాచ్ ల్లో ఆర్సీబీ గ్రీన్ జెర్సీతో బరిలోకి దిగింది. కానీ ఇందులో ఐదు మ్యాచ్ ల్లోనే విజయం సాధించి.. మరో 9 మ్యాచ్ ల్లో ఓటమి పాలయ్యింది. మరొక మ్యాచ్ మాత్రం రద్దయ్యింది. 2015లో ఢిల్లీ క్యాపిటల్స్ తో గ్రీన్ డే మ్యాచ్ వర్షంతో తుడిచిపెట్టుకుపోయింది.


2011 నుంచి 'గ్రీన్ జెర్సీ' మ్యాచ్ లను ఆడడం ప్రారంభించిన ఆర్సీబీకి పెద్దగా కలిసిరాలేదు. గత సీజన్ లో రాజస్తాన్ తో జరిగిన మ్యాచ్ వరకు 15 మ్యాచ్ లు ఆడింది. ఇందులో ఐదు మ్యాచ్ ల్లో ఆర్సీబీ గెలిచినప్పటికీ విరాట్ కోహ్లి రెండుసార్లు డకౌట్ కాగా, ఒక మ్యాచ్ లో సెంచరీ, మరో మ్యాచ్ లో కీలకమైన 27 పరుగులు చేశాడు.

**గ్రీన్ జెర్సీతో ఆర్సీబీ విజయాలు..**

ఐపీఎల్ 2011లో కొచ్చి టస్కర్స్ తో మ్యాచ్లో ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కొచ్చి 125/9 స్కోరుకే పరిమితం కాగా.. ఆర్సీబీ 13.1 ఓవర్లలోనే 128/1 స్కోరు చేసి గెలుపొందింది. విరాట్ (27₹) నాటౌట్ గా నిలిచాడు.

2016 సీజన్లో గుజరాత్ లయన్స్ పై 144 పరుగుల భారీ తేడాతో ఆర్ సీబీ గెలిచింది. ఈ మ్యాచ్ లోనే విరాట్ కోహ్లి (109) సెంచరీ బాదాడు. ఏబీ డివిలియర్స్ (129₹) కూడా శతకం చేయడంతో ఆర్సీబీ మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 248 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం గుజరాత్ లయన్స్ 104 పరుగులకే ఆలౌటైంది.

2022 సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ 67 పరుగుల తేడాతో విజయం సాధించి మూడో విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్ లో కోహ్లి గోల్డెన్ డక్గా వెనుదిరిగాడు. అయితే డుప్లెసిస్ (73₹), రజత్ పటీదార్ (48) రాణించడంతో 192 పరుగుల



చేసింది. లక్ష్య ఛేదనలో హైదరాబాద్ 125 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది.

2023 సీజన్లో రాజస్తాన్ రాయల్స్తో జరిగిన మ్యాచ్ చివరి ఓవర్ వరకూ ఉత్కంఠగా సాగింది. ఈ మ్యాచ్లోనూ కోహ్లి గోల్డెన్ డక్ అవ్వడం విశేషం. అయితే మ్యాక్స్వెల్ (77₹), డుప్లెసిస్ (62) విజృంభణతో రాజస్తాన్ ముందు 190 పరుగుల టార్గెట్ను ఉంచింది. అయితే ఛేదనలో రాజస్తాన్ పోరాడినప్పటికీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులకు పరిమితమైంది.

గత సీజన్లోనూ రాజస్తాన్ రాయల్స్తోనే గ్రీన్ జెర్సీలో ఆర్సీబీతో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనంతరం ఆర్సీబీ 17.3 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. విరాట్ కోహ్లి (62 నాటౌట్) అజేయ అర్థసెంచరీ సాధించి ఆర్సీబీని గెలిపించాడు.



## మేం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరముంది: హార్దిక్ పాండ్య

ఐపీఎల్ 2026 సీజన్ లో వరుసగా నాలుగో ఓటమితో ముంబయి ఇండియన్స్ పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. తాజాగా వాంఖడే స్టేడియంలో జరిగిన పోరులో ముంబయికి ఓటమి తప్పలేదు. పంజాబ్ కింగ్స్ ఘన విజయం సాధించింది. బ్యాటింగ్ లో ఫర్వాలేదనిపించినా.. బౌలింగ్ లో ఘోరంగా విఫలమైనట్లు ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య, కోచ్ మహేల జయవర్ధనె తెలిపారు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హార్దిక్ వెల్లడించాడు. దారుణ ప్రదర్శనకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశాడు. ''ఇప్పుడు ఏం చెప్పాలో కూడా అర్థంకావడం లేదు. ఎక్కడ బలహీనంగా మారామో తెలుసుకుంటాం. వ్యక్తిగతంగానా? జట్టుగా విఫలమయ్యామా? ప్రణాళికల్లో ఏదైనా లోపమా? అనేది విశ్లేషించుకుంటాం. తర్వాత మ్యాచ్ లో ఏం చేయాలనే దానిపై చర్చించుకుంటాం. ఈ క్రమంలో కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నా. మున్ముందు మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆశిస్తున్నా. ఈ సమయంలో మా ముందు కఠినమైన ప్రశ్నలు ఎదురవుతాయి. వాటికి సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతిఒక్కరి పైనా ఉంది. ఇదే సమయంలో ప్రత్యర్థి ఆటగాళ్ల ప్రదర్శనను అభినందించాలి. చాలా బాగా ఆడారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించారు. ఫీల్డింగ్ లోనూ మాకంటే మెరుగ్గా ఉన్నారు'' అని పాండ్య తెలిపాడు.

**బుమ్రా బాగానే వేస్తున్నాడు.. కానీ: మహేల**


''జస్ ప్రీత్ బుమ్రాకు వికెట్లు రావడం లేదంటే బౌలింగ్ సరిగా వేయడం లేదని కాదు. బుమ్రా విషయంలో అనవసరమైన రిస్క్ తీసుకోవడానికి ప్రత్యర్థి బ్యాటర్లు మొగ్గు చూపించరు. మేం కూడా భిన్నంగా ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. కేవలం బుమ్రా వైపే కాకుండా.. బౌలింగ్ యూనిట్ మొత్తం గొప్పగా రాణించలేదు. దీనిపై మేం వర్కౌట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒక్కసారి బుమ్రా వికెట్లు తీయడం ప్రారంభిస్తే అతడిని ఆపడం ఎవరితరమూ కాదు'' అని మహేల వెల్లడించాడు.

## హీరోయిన్ రాశీ ఖన్నా నగదు మాయం..!



హీరోయిన్ రాశి ఖన్నాకు చేదు అనుభవం ఎదురైంది. తాను నటిస్తోన్న ఓ మూవీ షూటింగ్ లో ఆమె నగదు చోరీకి గురైంది. రాశీ హ్యాండ్ బ్యాగ్ నుంచి రూ.50 వేలను తస్కరించినట్లు తెలుస్తోంది. మూవీ సెట్స్ లోని వానిటీ వ్యాన్ లో పనిచేసే ఓ ఉద్యోగి ఈ దొంగతనానికి పాల్పడ్డారు. అతన్ని వెంటనే గుర్తించిన భద్రతా సిబ్బంది అతడిని చితకబాది.. బయటికి గెంటేశారు. ఈ చోరీతో మూవీ సెట్స్ లోని సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. మూవీ షూటింగ్ కు కాసేపు అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన చూసి చాలా దిగ్భ్రాంతికి గురైనట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఇలాంటి సంఘటనలు జరగడం పరిశ్రమకు సిగ్గుచేటన్నారు. కానీ ఎలాంటి చోరీ జరగలేదని రాశీ ఖన్నా టీమ్ చెప్పడం విశేషం. ఈ విషయంపై మాట్లాడటానికి రాశీ ఖన్నా మేనేజర్ నిరాకరించారు. కాగా.. రాశీ ఖన్నా ప్రస్తుతం అనీస్ బాజ్మీ దర్శకత్వంలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ లతో కనిపించనుంది.

## అల్లు అర్జున్ 'రాకా'లో షారుక్?



పతాక స్థాయిలో అంచనాలున్న భారతీయ చిత్రాల్లో 'రాకా' ఒకటి. 'పుష్ప' సినిమాలతో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించిన అల్లు అర్జున్ కథానాయకుడిగా - అట్లీ దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న చిత్రమిది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ ఇటీవలే విడుదలై అందరి దృష్టినీ ఆకర్షించింది. అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి సినిమాపైన మరింత ఆసక్తిని రేకెత్తించారు. ముంబయిలోనే ఎక్కువగా చిత్రీకరణ చేసుకొంటున్న ఈ సినిమాలో బాలీవుడ్ అగ్ర తార షారుక్ ఖాన్ అతిథి పాత్రలో నటిస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. దర్శకుడు అట్లీ - కథానాయకుడు షారుక్ మధ్య మంచి సంబంధాలున్నాయి. ఈ ఇద్దరూ కలిసి ఇదివరకు 'జవాన్' చిత్రం చేశారు. ఆ అనుబంధం దృష్ట్యా షారుక్ అతిథి పాత్ర ప్రచారానికి బలం చేకూరుతోంది. ఇందులో కథానాయికగా దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఆమెతోపాటు రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు? అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

## ఆ బిగ్ ప్లాట్ ఫామ్ పై 'టాక్సిక్' 9 నిమిషాల స్పెషల్ కంటెంట్.. నచ్చిందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న నెక్స్ట్ బిగ్ థింగ్ సినిమానే టాక్సిక్. వరల్ క్లాస్ లెవెల్లో తన దగ్గర రెండు భారీ సినిమాలు ఉన్నాయి. మరి వాటిలో ఒకటి ఈ టాక్సిక్ కాగా మేకర్స్ ఈ సినిమాని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి తెరకెక్కించారు. అయితే విడుదల అనుకున్న సమయానికి జరగలేదు కానీ వరల్ వైడ్ బిగ్గెస్ట్ సినీ ప్లాట్ ఫామ్ లలో ఒకటైన సినిమా కాన్ ఈవెంట్ లో ఈ సినిమాకి చోటు దక్కింది. ఎన్నో హాలీవుడ్ సినిమాల ఎక్స్ క్లూజివ్ కంటెంట్ తో పాటుగా టాక్సిక్ సినిమా తాలూకా కంటెంట్ కూడా పడిందట. అక్కడ సినిమా తాలూకా 9 నిమిషాల ఎక్స్ క్లూజివ్ స్పెషల్ కంటెంట్ ని మేకర్స్ సినీ ప్రముఖులకు చూపించగా వారు ఇంప్రెస్ అయినట్టు తెలుస్తుంది. అయితే టాక్సిక్ ఇంగ్లీష్ రిలీజ్ కి ఇది ఒకింత బూస్టప్ కూడా కావచ్చని చెప్పాలి. మరి ఈ స్టెప్ తర్వాత టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్ కి ఏమన్నా ప్లస్ అవుతుందా లేదా అనేది చూడాల్సిందే. ఈ భారీ సినిమాని గీతూ మోహన్ దాస్ తెరకెక్కించగా కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహించారు.

## 'జైలర్ 2' ఫుటేజ్ కూడా లీక్?



జస్ట్ కొన్ని రోజుల కితమే కోలీవుడ్ నుంచి అవైటెడ్ సినిమా జన నాయగన్ తాలూకా ఫుటేజ్ ఇంకా థియేటర్స్ లో రిలీజ్ కాకుండానే ఆన్లైన్ లోనే లీక్ అయ్యి కలకలం రేపింది. దీనితో మేకర్స్ భారీ నష్టం చూసారు. మరి ఇది మరిచే లోపే మరో బిగ్గెస్ట్ సినిమా సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన సెన్సేషనల్ మాస్ సీక్వెల్ సినిమా జైలర్ 2 ఫుటేజ్ కూడా ఆన్లైన్ లో లీక్ అయ్యింది అంటూ ఓ టాక్ సోషల్ మీడియాలో ఇప్పుడు షాకింగ్ గా మారింది. అయితే ఇందులో అసలు నిజం లేనట్టే తెలుస్తోంది. లీక్ అయ్యింది అనే టాక్ ఉంది కానీ ఫుటేజ్ వచ్చిన దాఖలాలు అయితే ఎక్కడా కనిపించడం లేదు. సో తప్పుడు సమాచారం సర్క్యులేట్ చేస్తున్నారని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ సినిమాని నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. అలాగే అనిరుద్ సంగీతం అందిస్తున్నాడు, సన్ పిక్చర్స్ నిర్మాణం వహిస్తున్న విషయం తెలిసిందే.



## ఐఎన్సీఏ అవార్డుల ప్రదానోత్సవం.. నాగచైతన్యకు పురస్కారం



ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (ఐఎన్సీఏ) అవార్డుల ప్రదానోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముంబయి వేదికైంది. చిత్ర పరిశ్రమలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకొస్తూ.. నిర్వహించిన ఈ ఈవెంట్ లో చాలామంది సినీ ప్రముఖులు సందడి చేశారు. టాలీవుడ్ యాక్టర్ రానా, నటి శ్రియ, బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతలుగా అదరగొట్టారు. టాలీవుడ్ నుంచి ఉత్తమ నటుడిగా నాగచైతన్య అవార్డు అందుకున్నారు. 'తండేల్' సినిమాకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి, ఉత్తమ హాస్యనటుడిగా మాస్టర్ రేవంత్ అవార్డులు అందుకున్నారు.

మలయాళం నుంచి ఉత్తమ నటిగా కల్యాణి ప్రియదర్శన్ (లోక ఛాప్టర్ 1), కోలీవుడ్ నుంచి ఉత్తమ నటుడిగా దుల్కర్ సల్మాన్ (కాంత), ఉత్తమ నటిగా సిమ్రన్ (టూరిస్ట్ ఫ్యామిలీ), కన్నడ నుంచి ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి (కాంతారా ఛాప్టర్1) అవార్డులు స్వీకరించారు. నటులుగా భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన కృషికి గానూ కమల్ హాసన్, రేఖను ప్రత్యేక అవార్డులు వరించాయి. కమల్ హాసన్ కు నిర్మాత అల్లు అరవింద్, రేఖకు కమల్ హాసన్ పురస్కారాలను అందజేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.